నేడు మంత్రి నారా లోకేశ్ రాక



విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం నగరానికి వస్తున్నారు. ఇక్కడ నుంచి పార్వతీపురం మన్యం జిల్లా భామిని వెళతారు. ఈ నెల ఐదో తేదీన జరగనున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో మంత్రి పాల్గొంటారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం...గురువారం మధ్యాహ్నం 2.50 గంటలకు విజయవాడలో బయలుదేరి 3.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో భామిని బయలుదేరి వెళతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

ఏసీబీ వలలో ఏఎస్‌వో

లంచం తీసుకుంటూ పట్టుబడిన సహాయ పౌర సరఫరాల శాఖ అధికారి

- వాహనాల విడుదలకు రూ.10 వేలు డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
- కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



పట్టుబడిన గాజువాక సర్కిల్-3 ఏఎస్‌వో బి.కృష్ణ

గాజువాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):
రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో సీజ్ చేసిన వాహనాలను విడుదల చేసేందుకు లంచం తీసుకుంటూ పౌర సరఫరాల శాఖ గాజువాక సర్కిల్-3 ఏఎస్‌వో బి.కృష్ణ బుధవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన ఎ.నారాయణ వాహనాలు రెండు ఐదు నెలల కిందట అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఏఎస్‌వో కృష్ణ పట్టుకుని న్యూపోర్టు పోలీసులకు అప్పగించారు. ఆ వాహనాలను విడుదల చేయాలని పలుమార్లు ఏఎస్‌వోను కోరినప్పటికీ పట్టించుకోలేదు. డబ్బు ఇస్తేనే విడుదల చేస్తానని పట్టుబట్టాడు. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించడంతో అతడికి అనుకూలంగా తీర్పు వచ్చింది. వాహనాలను తక్షణమే విడుదల చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. ఈ మేరకు సీజ్ చేసిన రెండు వాహనాలను నారాయణకు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ గత అక్టోబరులో గాజువాక ఏఎస్‌వోను ఆదేశించారు. అయినప్పటికీ వాహనాలను అప్పగించేందుకు ఏఎస్వో లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు మంగళవారం ఏసీబీ కార్యాలయానికి వెళ్లి ఏఎస్‌వోపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పక్కా ప్లాన్ ప్రకారం బుధవారం సాయంత్రం గాజువాక ఏఎస్‌వో కార్యాలయంలో నారాయణ వద్ద నుంచి ఏఎస్‌వో కృష్ణ రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు ఫైళ్లను పరిశీలించి, సిబ్బందిని విచారించారు. ఏఎస్‌వో కృష్ణపై కేసు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

అవినీతిలో ఘనుడు

- సర్కిల్-3 సహాయ పౌర సరఫరాల అధికారి టి.కృష్ణపై చాలాకాలంగా ఆరోపణలు
- ఒక్కో డిపో నుంచి నెలకు రూ.2 వేలు చొప్పున వసూలు
- రేషన్ డీలర్ల సంఘ నేతతో కలిసి కొన్ని డిపోల నిర్వహణ
- రైస్ మాఫియాతో చెట్టాపట్టాల్

విశాఖపట్నం/గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
గాజువాక కేంద్రంగా గల సర్కిల్-3 సహాయ పౌర సరఫరాల అధికారి టి.కృష్ణ అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతుంటారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే మాఫియాతో చెట్టపట్టాలేసుకుని తిరిగే కృష్ణ బుధవారం రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. గత ప్రభుత్వ హయాంలో గాజువాక ఏఎస్‌వోగా వచ్చిన కృష్ణ మూడేళ్లుగా అక్కడే తిష్ట వేశారు. కూటమి నేత దన్ను ఉందని చెప్పుకునే ఆయన...పౌర సరఫరాల శాఖలో సీనియర్ అధికారులను కూడా ఖాతరు చేయరు. ఉమ్మడి ఏపీలో పౌర సరఫరాల శాఖ అధికారుల సంఘం కోశాధికారిగా పనిచేయడంతో ఉన్నతాధికారులతో కూడా పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన పరిధిలో రేషన్ బియ్యం ... మిగతా 6వ పేజీలో

మిలటరీ ఆపరేషన్లకే విశాఖ విమానాశ్రయం

- భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తరువాతే...
- తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా
- 14న నేవీ మారథాన్



విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తరువాత విశాఖపట్నం విమానాశ్రయాన్ని పూర్తిగా మిలటరీ ఆపరేషన్లకు ఉపయోగిస్తామని తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా తెలిపారు. నేవీ డే సందర్భాన్ని పురస్కరించుకొని ఐఎన్ఎస్ హిమగిరిపై బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలి సమీపాన బాడంగిలోని ఎయిర్ స్ట్రిప్‌ను కూడా ఉపయోగించుకునే అవకాశాలు పరిశీలిస్తున్నామన్నారు. నేవీలో హనీ ట్రాప్‌ల గురించి మాట్లాడుతూ, ఎక్కువగా ఇరవయ్యేళ్ల వయసు కలిగిన వారే ఈ ఉచ్చులో పడుతున్నారని, సెయిలర్లు, డాక్‌యార్డ్ ఉద్యోగులు అందులో ఉంటున్నారన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు కూడా చేపడుతున్నామని వివరించారు. డిసెంబరు 14న నేవీ మారథాన్‌ను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ 97 వేల మొక్కలు నాటామని, మరో కోటి విత్తన బంతులు వెదజల్లామన్నారు.

నేడు భారత్, దక్షిణాఫ్రికా క్రికెటర్లు రాక

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
వన్డే సిరీస్‌లో భాగంగా ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈ నెల ఆరో తేదీన జరగనున్న మ్యాచ్‌లో తలపడనున్న భారత్, దక్షిణాఫ్రికా జట్ల ఆటగాళ్లు గురువారం నగరానికి చేరుకోనున్నారు. రాయ్‌పూర్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకుని, విమానాశ్రయం నుంచి బస్సుల్లో హోటల్‌కు వెళతారు. గురువారం విశ్రాంతి తీసుకుని, శుక్రవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

మిక్స్‌డ్ సాల్వెంట్ పక్కదారి!

పరిశ్రమల్లో వినియోగించాల్సిన సాల్వెంట్‌లో కొన్ని రసాయనాలు కలిపి ఇండస్ట్రియల్ డీజిల్‌గా పేర్కొంటూ అమ్మకాలు

- హైదరాబాద్, చెన్నై కేంద్రాలుగా ముఠాల కార్యకలాపాలు
- యథేచ్ఛగా చట్టాల ఉల్లంఘన
- ఇటీవల పెందుర్తిలో 26,277 లీటర్లతో ఉన్న ట్యాంకర్లు సీజ్
- 'నవీరా' అనే సంస్థపై పౌర సరఫరాల శాఖ కేసు



పెందుర్తిలో అధికారులు సీజ్ చేసిన ఇండస్ట్రియల్ డీజిల్ ట్యాంకర్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

రసాయన, వాటి అనుబంధ పరిశ్రమల్లో వినియోగించాల్సిన మిక్స్‌డ్ సాల్వెంట్ (ఇండస్ట్రియల్ డీజిల్) దుర్వినియోగమవుతోంది. నిబంధనల మేరకు కేవలం కొన్ని పరిశ్రమల్లో రసాయనాలను వేరు చేయడానికి మాత్రం ఉపయోగించాల్సిన మిక్స్‌డ్ సాల్వెంట్ (పెట్రోలియం బైప్రొడక్టు)ను వాహనాలను వినియోగించడంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోంది.

రసాయన కంపెనీలు నేరుగా చమురుశుద్ధి కంపెనీల నుంచి ఈ మిక్స్‌డ్ సాల్వెంట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ హైదరాబాద్, చెన్నైకు చెందిన కొన్ని మాఫియా ముఠాలు మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌ల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి దానికి మరికొన్ని కెమికల్స్ కలిపి ఇండస్ట్రియల్ డీజల్‌గా చెబుతూ విక్రయాలు సాగిస్తున్నాయి. ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడుతున్న ముఠాను గత నెల 25న పెందుర్తి వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకుని పౌర సరఫరాల అప్పగించారు. దీనికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన 'నవీరా' అనే సంస్థపై పౌర సరఫరాల శాఖ కేసు నమోదుచేసింది. 26,277 లీటర్లతో ఉన్న మూడు ఇండస్ట్రియల్ డీజిల్ ట్యాంకర్లను సీజ్ చేసింది. మిక్స్‌డ్ సాల్వెంట్ కొనుగోలు, సరఫరాకు సంబంధించి సదరు సంస్థ చట్టాలు ఉల్లంఘించినట్టు గుర్తించింది. చమురుశుద్ధి పరిశ్రమల నుంచి రసాయన కంపెనీలకు నేరుగా సరఫరా కావల్సిన మిక్స్‌డ్ సాల్వెంట్‌ను దారిమళ్లించడం వెనుక భారీ నెట్‌వర్క్ ఉందని అంచనాకు వచ్చింది. ఈ నెట్‌వర్క్ ఆగడాలను అరికట్టడానికి ఉన్నతస్థాయిలో చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు.

ఫార్మా, కెమికల్, పాలిమర్స్ తదితర కంపెనీల్లో మిక్స్‌డ్ సాల్వెంట్‌ను వినియోగిస్తారు. రెండు, మూడు రకాల కెమికల్స్‌ను విభజించడానికి ఈ సాల్వెంట్‌ను వాడతారు. పెట్రోలియం బైప్రొడక్టులలో మిక్స్‌డ్ సాల్వెంట్, నాఫ్తా, తారు, తదితర ఉత్పత్తులు ఉన్నాయి. మిక్స్‌డ్ సాల్వెంట్‌ను చమురు శుద్ధి కంపెనీల నుంచి రసాయన ఉత్పత్తులు తయారుచేసే కంపెనీలు కొనుగోలు చేయడానికి అనేక అనుమతులు తీసుకోవాలి. ఏడాదికి అవసరమైన మిక్స్‌డ్ సాల్వెంట్ సరఫరాకు సంబంధిత కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, ఆ తరువాత పౌర సరఫరాల శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ పరిశ్రమలో ఏ మేరకు మిక్స్‌డ్ సాల్వెంట్ అవసరం అనేది పరిశీలించిన తరువాత కలెక్టర్‌కు ప్రతిపాదిస్తే అనుమతి ఇస్తారు. ఇంకా ఎక్స్‌ప్లోజివ్ డైరెక్టరేట్, జాయింట్ కలెక్టర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అన్నిరకాల అనుమతులు తీసుకోవాలి. అంతేగాకుండా పరిశ్రమ ఆవరణలో ఒక మూలన మిక్స్‌డ్ సాల్వెంట్ ట్యాంకులు అన్‌లోడింగ్‌ను అనువుగా వేదిక నిర్మించాలి. అక్కడ పది వేల లీటర్ల నీరు, పది లారీల ఇసుక సిద్ధంగా ఉంచాలి. అక్కడ నుంచి సాల్వెంట్ నిల్వ చేసే ట్యాంకుకు పైపులైన్ ద్వారా మాత్రమే కెమికల్ సరఫరా చేయాలి. ప్రతి ట్యాంకు నుంచి ... మిగతా 6వ పేజీలో

నృసింహ దీక్షలకు శ్రీకారం

- మాలలు ధరించిన వేలాది మంది భక్తులు
- జనవరి 12న విరమణకు ముహూర్తం



మాలధారణ చేస్తున్న ప్రధానార్చకులు

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి కృపకు పాత్రులు కావాలనే సంకల్పంతో భక్తులు ఏటా ఆచరించే నృసింహ దీక్షలకు బుధవారం శ్రీకారం చుట్టారు. 41 రోజుల మండల దీక్షల అనంతరం జనవరి 12న దీక్షల విరమణ కార్యక్రమం జరుగుతుంది.

అప్పన్న ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై అర్చకులు భక్తులకు చందనమాలలను వేసి నృసింహ దీక్షలకు నాంది పలికారు. ప్రధాన రాజగోపురం వద్ద సాంకేతిక శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై ఉంచిన సింహాద్రినాథుని నమూనా విగ్రహం వద్దకు ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతా రామాచార్యుల సారథ్యంలో అధికారులు చందన మాలలతో చేరుకున్నారు. స్వామికి షోడశోపచారాలు సమర్పించి, పుణ్యాహవచన తీర్థజలాలతో మాలలను, భక్తులను ప్రోక్షణ చేశారు. అనంతరం భక్తుల కంఠాన స్వామివారి మాడతో కూడిన తులసి మాలలు వేసి నృసింహ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షా సమయంలో అనుసరించాల్సిన నియమాలను భక్తులకు వివరించారు. కసిరెడ్డి సురేంద్ర, సానబోయిన పైడిరాజు ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం దీక్షధారులు అంతరాలయంలో స్వామిని దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈవో ఎన్.సుజాత, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారులు వెంకటేశ్వరరావు, సత్య శ్రీనివాస్, పీఆర్వో అప్పలనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉక్కు మంత్రి కుమారస్వామితో ఎంపీ శ్రీభరత్ భేటీ

- కర్మాగారం పరిరక్షణకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి



కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్‌లతో ఎంపీ శ్రీభరత్ -6లో

కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు

రోడ్డుపై నిల్చుని వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ

- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరిక
- సమయపాలన తప్పనిసరి
- రద్దీ వేళల్లో చలాన్‌ల వసూళ్ల జోలికి వెళ్లొద్దని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




వెంకోజీపాలెం కూడలిలో రోడ్డుపై నిల్చొని విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
ట్రాఫిక్ విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్ స్పష్టంచేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంపై 'గజిబిజి, గందరగోళం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ముఖ్యమైన కూడళ్లలో విధులు నిర్వర్తించే సిబ్బందిలో కొందరు వాహనాల రాకపోకలను పట్టించుకోకుండా సెల్‌ఫోన్లలో రీల్స్ చూసుకుంటూ కాలక్షేపం చేస్తుండడం, సిగ్నల్ జంప్ చేసిన వాహనాలను చూసీచూడనట్టు వదిలేస్తుండడంపై ఫొటోలతో సహా కథనం ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించారు. దీనిపై ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్ టెలీకాన్ఫరెన్స్‌లో ట్రాఫిక్ సీఐలను ఆరాతీశారు. సమయపాలన పాటించని, విధి నిర్వహణ సమయంలో ఫోన్‌లో మాట్లాడుతూ, వీడియోలు చూస్తూ కాలక్షేపం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సీఐ కూడా తమ పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేసి ట్రాఫిక్ పరిస్థితి, సిబ్బంది పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. రద్దీ వేళల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై మాత్రమే దృష్టి పెట్టాలని, ఆ సమయంలో చలాన్‌ల వసూళ్ల జోలికి వెళ్లకుండా రోడ్లపై నిలబడి విధులు నిర్వర్తించాలని స్పష్టంచేశారు. ప్రజలు తమను గమనిస్తుంటారనే విషయాన్ని సిబ్బందికి వివరించాలని, నిబద్ధతతో విధులు నిర్వర్తించేలా సమాయత్తం చేయాల్సిన బాధ్యత సీఐలదేనని ఏడీసీపీ స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రధాన కూడళ్ల వద్ద సిబ్బంది రోడ్డుపై నిలబడి విధులు నిర్వర్తించడం కనిపించింది. ఫోర్త్ టౌన్ సమీపంలో శంకరమఠం రోడ్డు కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదని 'ఆంధ్రజ్యోతి'లో ఫొటోలు ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

జూ అభివృద్ధి

జంతు ప్రదర్శనశాలతో పాటు ఎదురుగా ఉన్న కంబాలకొండ అభయారణ్యం కూడా...

- పర్యాటకులను ఆకర్షించడానికి ఎకో రిక్రియేషనల్ కార్యక్రమాలు నిర్వహించాలని యోచన
- వీఎంఆర్‌డీఏ ద్వారా కన్సల్టెంట్ నియామకానికి ప్రకటన జారీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
విశాఖపట్నం జంతు ప్రదర్శనశాల (జూ)తో పాటు ఎదురుగా ఉన్న కంబాలకొండ అభయారణ్యాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. సింగపూర్ జూ తరహాలో విశాఖ జూను అభివృద్ధి చేయాలని ఇక్కడి ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా సింగపూర్ వెళ్లి అన్నీ పరిశీలించారు. అక్కడి జూ నిర్వాహకులను విశాఖపట్నం పిలిపించారు. వారికి రెండు రోజుల పాటు విశాఖ జూను, కంబాలకొండను చూపించారు. దీనిని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చునో సూచించాలని కోరారు. ఇదంతా ఆరు నెలల క్రితం జరిగింది. ఈ అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని ఎంపీ శ్రీభరత్ యత్నిస్తున్నారు. జూ, కంబాలకొండలను పర్యవేక్షించే అటవీ శాఖ అధికారులకు భారీఎత్తున అభివృద్ధి పనులు చేపట్టే యంత్రాంగం లేకపోవడంతో దీనికి అవసరమైన ప్రాథమిక పనులు చేపట్టే బాధ్యతను విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు అప్పగించారు.

సుమారుగా 625 ఎకరాల విస్తీర్ణంలో జూ ఉంది. అందులో 325 ఎకరాలను మాత్రమే జంతువుల సంరక్షణకు ఉపయోగించుకుంటున్నారు. ఇంకో 300 ఎకరాలు ఖాళీగా ఉంది. దీనికి ఎదురుగానే కంబాల కొండ ఉంది. ఈ రెండింటిని కలిపి అభివృద్ధి చేయనున్నారు. వీటిలో వైల్డ్ లైఫ్, ఆక్వాటిక్ లైఫ్‌తో పాటు పర్యాటకులను ఆకర్షించడానికి ఎకో రిక్రియేషనల్ కార్యక్రమాలు నిర్వహించాలని యోచిస్తున్నారు. దీనికి అవసరమైన ప్రణాళిక రూపొందించడానికి ఒక కన్సల్టెంట్ అవసరమని భావించారు. దీని కోసం వీఎంఆర్‌డీఏ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీచేసింది. ఈ రంగంలో అనుభవం ఉన్నవారు ఈ రెండు ప్రాంతాలను సమీకృతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించి ఈ నెల 23వ తేదీలోగా సమర్పించాలని సూచించింది. ఎవరి ఆలోచనలు ... మిగతా 6వ పేజీలో

జంబో అజెండా!

6న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

- 257 అంశాలతో అజెండా రూపొందించిన అధికారులు
- జనవరిలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపునకు ప్రతిపాదన
- ముందస్తు అనుమతి ఇచ్చిన ఎనిమిదినెలల తర్వాత ర్యాటిఫికేషన్



విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

'నవ్విపోదురుగాక...' అన్నచందంగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ వ్యవహారశైలి మారిపోతోంది. ప్రజాధనం ఖర్చుచేసే అంశంలో అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షించే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన స్టాండింగ్‌కమిటీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈనెల ఆరున నిర్వహించే స్టాండింగ్ కమిటీ సమావేశానికి 257 అంశాలతో జంబో అజెండాను సిద్ధంచేశారు. ఈ ఏడాది జనవరి నాలుగున జరిగిన ఐఎఫ్ఆర్ ఏర్పాట్లకు చేసిన ఖర్చులకు గాను కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు అంశాన్ని తాజా అజెండాలో చేర్చడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత 12 నెలల్లో సుమారు ఏడెనిమిదిసార్లు స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. వాటిల్లో ఐఎఫ్ఆర్ ఏర్పాట్లకు చేసిన ఖర్చుల బిల్లు పెట్టని అధికారులు 11 నెలల తర్వాత పొందుపరచడం వెనక మతలబులేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా నగరంలో రోడ్లపై తిరిగే పశువులను పట్టుకునేందుకు రెండు టాటా ఏస్ వాహనాలను సమకూర్చేందుకు రూ.48.6 లక్షలు వెచ్చించే ప్రతిపాదనను అజెండాలో చేర్చారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో తిరిగే పందులను చంపడంతోపాటు వీధి కుక్కలను పట్టుకుని ఆపరేషన్ సెంటర్లకు తరలించేందుకు వలలు, రింగుల కొనుగోలు, ఆపరేషన్ చేసేందుకు, తూటాల కొనుగోలుకు రూ.38.5 లక్షలు ఖర్చవుతుందని ప్రతిపాదించారు. ఆయా పనులను 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు నిర్వహించేలా కాంట్రాక్టర్లకు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ముందస్తు అనుమతి ... మిగతా 6వ పేజీలో

సైన్స్ ఫెయిర్ తేదీలివే

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైన్సు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం, వారితో వివిధ రకాల పరికరాలను తయారు చేయించి ప్రదర్శించే సైన్సు ఫెయిర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. పాఠశాల స్థాయిలో 8న, మండలస్థాయిలో 10న, జిల్లాస్థాయిలో 12న నిర్వహిస్తారని ఎంఈవో ఎం.శివరాణి తెలిపారు.

శ్మశానవాటిక ప్రారంభం

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివీస్ యాజమాన్యం తూడెం గ్రామంలో నిర్మించిన శ్మశానవాటికను బుధవారం సర్పంచ్ జి.నరసయ్యమ్మ, దివీస్ అధికారులు ప్రారంభించారు. ఇందుకోసం దివీస్ యాజమాన్యం రూ.13.15,390లను ఖర్చు చేసింది. ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

పద్మనాభం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.లీలా ప్రసాద్ తెలిపారు. కలుషిత నీరు తాగవద్దని, నివాస పరిసరాల్లో వాడుక నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి వారం ఇళ్లలో నీటి నిల్వలను పారబోయాలన్నారు.

కార్యదర్శులకు పదోన్నతి

పద్మనాభం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి లభించింది. రెడ్డిపల్లి కార్యదర్శి నూర్జహాన్‌ను కోటవురట్ల, మద్ది కార్యదర్శి ఎ.కూర్మారావును నాతవరం, రేవిడి కార్యదర్శి వి.శ్రీసాయిశ్‌ను విజయనగరం జిల్లా సంతకవిటి డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు.

ముగిసిన 'రైతన్నా మీకోసం'

పద్మనాభం- రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లాభసాటి సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీకోసం..' ఇంటింటి ప్రచారం మంగళవారంతో ముగిసింది. గత నెల 24 నుంచి ప్రచారం, అవగాహన కల్పించారు. బుధవారం రైతు సేవాకేంద్రాల్లో రైతులతో వ్యవసాయాధికారులు, సిబ్బంది వర్క్‌షాప్ నిర్వహించారు.

జీవీఎంసీలో మూడు మండలాల విలీనం

» సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ఎమ్మెల్యే గంటా
» సాగులో సాంకేతికతతో అధిక ఆదాయం
» బోని గ్రామంలో రైతన్నా మీ కోసం

ఆనందపురం, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూత్రప్రాయంగా అంగీకరించారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి ఎమ్మెల్యే గంటా సహా కూటమి నేతలు క్షీరాభిషేకం చేశారు. మండలంలోని బోని గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన 'రైతన్న మీ కోసం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్యపరంగా డిమాండ్ ఉన్న పంటల ద్వారా వ్యవసాయాన్ని పండుగలా మార్చడానికి ముఖ్యమంత్రి ప్రణాళికాబద్ధగా కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్యాన్ని అందించే మిల్లెట్ వంటలు నచ్చాయన్నారు. ఆర్థికంగా అండగా నిలిచేందుకు 47 లక్షల రైతుల ఖాతాల్లోకి రెండు విడతల్లో రూ.14 వేల చొప్పున ప్రభుత్వం మొత్తం రూ.6,300 కోట్లు జమ చేసిందన్నారు. భీమిలి నియోజకవర్గంలో 15 వేల మందికి రూ.11 కోట్లు అందాయన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హతల గుర్తింపులో రాజకీయాలకు తావు లేదన్నారు. పంటలతో పాటు పువ్వులు నిల్వ చేసుకోవడానికి రైతులు సొసైటీగా ఏర్పడితే, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణం ద్వారా వారికి సహకరించేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. భూముల్లో తరాలుగా


వ్యవసాయశాఖ పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంటా

వ్యవసాయం చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు తొందరలోనే పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల హామీలు సమర్థంగా అమలు చేయడంతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నామన్నారు.

అనంతరం వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించి వ్యవసాయశాఖ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, వ్యవసాయశాఖ ఏడీ చంద్రశేఖర్, కూటమి నాయకులు చిక్కాల విజయబాబు, గాడు వెంకటప్పడు, బీఆర్బీ నాయుడు, కోరాడ రమణ, ఎస్.సత్యవరప్రసాద్, పాండ్రంకి అప్పలరాజు, శాఖరి శ్రీనివాస్, లీలావతి, స్వామినాయుడు, మల్లికార్జునరావు, రమేష్, శివాజీ, రామరాజు, దుర్గారావు, అచ్యుతరావు, అప్పలనాయుడు, కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఎమ్మెల్యే చర్చలు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు పరిధి జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస చెరువు పక్కన వెలసిన ఆక్రమణల తొలగింపునకు అధికారులు బుధవారం ప్రయత్నించగా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. ప్రత్యామ్నాయ స్థలం చూపే వరకూ చర్యలు చేపట్టవద్దని నిరసన తెలిపారు. ఆరు నెలల క్రితం ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద 30 మంది దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు వాటిని తొలగించి తగరపువలస కూడలిలోని ఖాళీ స్థలంలో ఉంచారు. అనంతరం ఆక్రమణలదారులలో కొంతమంది బడ్డీలను రాత్రికి రాత్రి సంగివలస సర్వీసు రోడుకు ఆనుకుని ఉన్న స్థలంలో పెట్టారు. దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతాయని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపినా చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో బుధవారం బడ్డీల తొలగింపునకు హైవే అధికారులు యత్నించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆ స్థలాన్ని పరిశీలించడంతోప్రత్యామ్నాయ స్థలాలు చూపించాల్సిందేనని ఆక్రమణదారులు డిమాండ్‌చేశారు. దీంతో ఈ స్థలం నీటిపారుదల శాఖకు చెందినదని, జీవీఎంసీ పరిధిలో ఉందని మీకు సంబంధం లేని విషయంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని హైవే అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో వారు తిరుగుముఖం పట్టారు.

అన్ని రంగాల్లో దివ్యాంగులను ప్రోత్సహించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

భీమునిపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎంఈవోలు 1, 2 ఎం.శివరాణి, ఎ.జయప్రద పిలుపునిచ్చారు. పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రత్యేకావసరాల పిల్లలకు శక్తిసామర్థ్యాలు అధికంగా ఉంటాయని, ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఈ ఏడాది 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతో 15 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు. సదరం సర్టిఫికెట్లు లేని వారు తక్షణం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంఈవో 1 ఎం.శివరాణి మాట్లాడుతూ భవిత ఐఈఆర్టీ టీచర్లు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫర్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్, గర్ల్ స్టైఫండ్, హెచ్‌బీఈ అలవెన్సులు అందుతాయని వివరించారు. జిల్లాస్థాయిలో ఇటీవల జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సదరం సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. క్యారమ్స్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెసెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామస్వామి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.రమణ, ఐఈఆర్టీ టీచర్లు జియాకుమారి, పార్వతి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం-రూరల్: రెడ్డిపల్లిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ పోటీలను నిర్వహించారు. ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్ మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్సు చైర్మన్ ఎంఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఆర్.విజయకుమార్, ఎం.శ్రీనివాసరావు, హైమావతి, రవిశంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై నవ నారసింహ క్షేత్ర దర్శనం

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో నవ నారసింహ క్షేత్రాల దర్శన సైకిల్ యాత్ర చేస్తున్నట్టు ముదునూరి నరసింహాచార్యులు తెలిపారు. పాలకొల్లులో ప్రారంభమైన యాత్ర బుధవారం సింహాచలం చేరుకుంది. అప్పన్న దర్శనం చేసుకున్న అనంతరం మాట్లాడుతూ దేరి అంతర్వేది, అప్పన్నపల్లి, అయినవిల్లి, ముక్తేశ్వరం, మురుముళ్ల, కుండలేశ్వరం, పిఠాపురం, స్టీల్ ప్లాంటు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని సింహగిరి చేరానన్నారు. మంగళగిరి, వేదాద్రి, పెంకలకోన, అహోబిలం, కదిరి, ధర్మపురి, యదగిరి లక్ష్మీనృసింహస్వామి దర్శనంతో యాత్ర ముగుస్తుందన్నారు.


సింహగిరికి చేరుకున్న సైకిల్ యాత్రికుడు

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



సీహెచ్‌సీ వద్ద కాంట్రాక్టు కార్మికుల ప్రదర్శన

భీమునిపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ కోరారు. బుధవారం భీమిలి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్టు వర్కర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. శానిటేషన్ పాత కాంట్రాక్టర్ ద్వారా రావాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపుల అవకతవకలపై చర్యలు తీసుకుని, కార్మికుల నష్టాన్ని పూడ్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఈశ్వరరావు, ఆకుల భవానీ, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన సతీశ్‌కుమార్


పతకంతో సతీశ్

తగరపువలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగివలసకు చెందిన ఎంవీపీ సతీష్‌కుమార్ కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాన్ని సాధించారు. కిక్‌బాక్సింగ్ ఫెడరేషన్, వాకో ఇండియా ఆధ్వర్యంలో ముంబై అంధేరి ఇండోర్ స్టేడియంలో ఈనెల 1న జరిగిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో 51, 53 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు త్వరలో జరగబోయే అంతర్జాతీయ పోటీలకు హాజరుకానున్నారు. డాక్టర్ త్రిపుర, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సమస్యలపై జీవీఎంసీ అధికారుల ఆరా

తగరపువలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డులో సమస్యలుపేరుకుని పోయాయని సోమవారం గ్రీవెన్సులో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ అధికారులు బుధవారం వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. నమ్మివానిపేటలో శ్మశానానికి వెళ్లే రహదారిని పక్కాగా నిర్మించాలని స్థానికులు కోరారు. సహాయ ఇంజనీర్ భార్గవి, వర్కు ఇన్‌స్పెక్టర్ జగదీష్ సమస్యలను కమిషనర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఎస్.కరుణాకర్‌రెడ్డి, వంశీరెడ్డి మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన అయ్యప్ప సేవా కార్యక్రమాలు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం అయ్యప్ప సేవాపీఠంలో దీక్షలు ముగిశాయి. పీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు కార్యక్రమాలను నిర్వహించారు. గురుస్వాములు కరుభక్త అప్పలనారాయణ, కనకల అప్పలరాజు, కంటుభక్త వెంకన్న కేరళ సంప్రదాయం ప్రకారం ప్రవీణ్‌కుమార్ నంబూద్రితో పూజలు చేయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, గుడ్డాల ఎల్లయ్య, జీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషిచేయాలి

» ఏఐసీసీ పరిశీలకుడు సునీల్ అహీర్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ అహీర్

ఆనందపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు సునీల్ అహీర్ పిలుపునిచ్చారు. మండలంలోని వేములవలస శుభశ్రీ కల్యాణ మండపంలో బుధవారం భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి సవరవిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అహీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగాయని గుర్తుచేశారు. ఆ తరువాత వచ్చిన పార్టీలన్నీ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్లు, ఆరోగ్యశ్రీ, 108, ప్రాజెక్టుల నిర్మాణాలతో పాటు అనేక కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత తరుణంలో రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ అవసరముందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామస్థాయిలో పర్యటించి పార్టీ వైభవాన్ని వివరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని, తద్వారా పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి నియామకంపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకుడు మార్టన్ లూథర్, బేగ్, జమ్ము ఆదినారాయణ, జిల్లా ఇన్‌చార్జి అడ్డాల వెంకటవర్మరాజు, భీమిలి ఇన్‌చార్జి సవరవిల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా హనుమత్ వ్రతం

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింహగిరి మెట్లమార్గంలో కొలువుదీరిన సాక్షిఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం సంప్రదాయబద్ధంగా హనుమత్‌వ్రతం నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి, హనుమ సహస్ర నామావళితో లక్ష తమల పత్ర పూజచేశారు. రామాయణంలోని పట్టాభిషేక సర్గ విన్నపాలు గావించారు. ప్రత్యేక హోమాలు మహాపూర్ణాహుతి జరిపారు. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పర్యవేక్షణాధికారి సత్యశ్రీనివాస్, పీఆర్వో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు, సింహగిరిపై ఇటలీ దేశస్థులు

సింహాచలంలో ఇటలీవాసులు

వరాహలక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఇటలీ దేశస్థులు దర్శించుకున్నారు. క్షేత్రమహాత్మ్యం, స్వామి అవతార విశేషాలను తెలుసుకున్నారు. కల్యాణమండపంలోని శిల్ప సంపదను పరిశీలించారు. భక్తులు వారితో సెల్ఫీలు తీసుకున్నారు. క్షేత్రమహాత్మ్యం పుస్తకాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా లభించలేదు.

రజిత గో సంతతిని సమర్పించండి

వరాహలక్ష్మీనృసింహస్వామికి మొక్కుబడులుగా భక్తులు గోసంతతిని సమర్పించటం ఆనవాయితీ. ఈ క్రమంలో స్వదేశీ గోవులు, ఎద్దులు, దూడలను సమర్పించాలని, లేదా రజిత, స్వర్ణంతో తయారు చేసిన ప్రతిమలను హుండీలలో సమర్పించి మొక్కులు తీర్చుకోవాలనిఈఓ సుజాత కోరారు.

ఘనంగా తిరునక్షత్ర పూజలు

వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నతిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలలో భాగంగా బుధవారం వేకువజామున ప్రభాతారాధనలు పూర్తిచేశారు. గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను, ఆళ్వార్లతో శోభాయమానంగా అలంకరించి ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. షోడశోపచారాల అనంతరం స్థానాచార్యులు డా.టీపీరాజగోపాల్ పర్యవేక్షణలో అధ్యాపకులు నాలాయిర దివ్యప్రబంధాన్ని అనుసంధానం చేశారు. అనంతరం రాజభోగ నివేదన, మంత్ర పుష్పం, మంగళ నీరాజనాలిచ్చి భక్తులకు తీర్థగోష్ఠి జరిపారు.

'స్నేహ' మ్యాక్స్ వ్యవస్థాపకుడు శివభాగ్యారావు అరెస్టు

» నిందితుడు రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'స్నేహ' మ్యాక్స్ సొసైటీ పేరుతో పలువురి నుంచి డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించకుండా పరారైన సంస్థ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి శివభాగ్యారావును ఎట్టకేలకు గోపాలపట్నం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...స్నేహ మ్యాక్స్ సొసైటీ పేరుతో సంస్థను స్థాపించిన శివభాగ్యారావు పలువురి నుంచి రూ.3.13 కోట్లు డిపాజిట్లు సేకరించారు. గడువు ముగిసినప్పటికీ సొమ్మును తిరిగి చెల్లించడం లేదంటూ 15 మంది ఖాతాదారులు ఈ ఏడాది ఆగస్టులో గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు పరారీలో ఉన్న శివభాగ్యారావు కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం హైదరాబాద్‌లో శివభాగ్యారావుతో పాటు సంస్థ భాగస్వామి అతడి కుమారుడు క్రాంతిని అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరినీ నగరానికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపారు.

రేపటి నుంచి విశాఖ, బ్రహ్మపూర్, పలాస రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని గరివిడి, జి.సిగడాం, చీపురుపల్లి సెక్షన్లలో ఆధునికీకరణ పనుల నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దుచేశామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. వీటిలో ఈ నెల 5, 7 తేదీల్లో విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), ఈ నెల 6, 8 తేదీల్లో బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525),బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531)లున్నాయి. ఈ నెల 6, 7 తేదీల్లో విశాఖ-పలాస మధ్య నడిచే 67289, 67290 మెము పాసింజర్ రైళ్లను రద్దు చేశామన్నారు. కాగా వారణాసి డివిజన్‌లోని బెనారస్ స్టేషన్ కోడ్‌ను బీఎస్‌బీఎస్ నుంచి బీఎస్‌ఆర్‌ఎస్‌గా మార్పుచేశామన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులో తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టరు పోస్టును నియమించనున్నట్టు ఎంఈవో పి.రమణ తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సోషల్ స్టడీస్‌తో బీఈడీ అర్హత కలిగిన అభ్యరులు అర్హులని తెలిపారు.

ఉక్కు మంత్రి కుమారస్వామితో ఎంపీ శ్రీభరత్ భేటీ

పెదవాల్తేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం పరిరక్షణకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డి కుమారస్వామికి ఎంపీ ఎం.శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్‌లతో కలిసి కేంద్ర మంత్రిని కలిశారు. ఉక్కు కర్మాగార భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. నిర్ణయాలు ఆలస్యం కాకుండా ఉండేందుకు పూర్తిస్థాయి చైర్మన్‌ను, డైరెక్టర్లను తక్షణం నియమించాల్సిన అవసరం ఉన్నదని మంత్రికి ఎంపీ వివరించారు. అలాగే దీర్ఘకాలిక స్థిరత్వం కోసం సెయిల్ ఆధ్వర్యంలోకి విశాఖ ఉక్కును తీసుకువెళ్లేందుకు గల అవకాశాలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ అంశాలన్నింటిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. విశాఖ ఉక్కు కర్మాగారంతోపాటు ఉద్యోగుల ప్రయోజనాల కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ శ్రీభరత్ అన్నారు.

జూ అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ప్రణాళికలు బాగుంటాయో గుర్తించి, వారిని కన్సల్టెంట్‌గా నియమిస్తారు. ఆ తరువాత ప్రణాళికాబద్ధంగా వాటిని అభివృద్ధి చేస్తారు. వీటికి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అవినీతిలో ఘనుడు

... 5వ పేజీ తరువాయి

పంపిణీలో అక్రమాలకు పాల్పడుతుంటారనే ఫిర్యాదులు ఉన్నాయి.

సర్కిల్-3 పరిధిలో 130 రేషన్ డిపోలు ఉన్నాయి. ప్రతి డిపో నుంచి నెలకు రెండు వేల వంతున మామూళ్లు వసూలు చేస్తున్నట్టు డీలర్లే చెబుతున్నారు. ప్రధానంగా బినామీ డిపోలకు సంబంధించి అక్రమాలకు ప్రోత్సహించారనే వాదన ఉంది. దీనికి అదనంగా నెలకు ఐదు వేల రూపాయల వరకూ తీసుకుంటున్నారు. అదేవిధంగా సర్కిల్-3లో కొన్ని షాపులను రేషన్ డీలర్ల సంఘం నేత ఒకరితో కలిసి ఏఎస్‌వోనే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఈ వ్యవహారం నడుపుతున్నారంటున్నారు. ఇంకా డిపోల ద్వారా పంపిణీ చేసే బియ్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే మాఫియాతో ఏఎస్‌వోకు సన్నిహిత సంబంధాలున్నాయి. రైస్ మిల్లర్ల నుంచి భారీగా మామూళ్లు తీసుకుంటున్నారని, అందుకే వారి అక్రమాలను చూసీచూడనట్టు వదిలేస్తున్నారని గాజువాక ప్రాంతానికి చెందిన డీలర్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందితే గత్యంతరం లేక డిపో లేదా అక్రమ బియ్యం తరలిస్తున్న వాహనాలపై కేసులు పెడుతుంటారు తప్ప అధికారిగా తన విధులు నిర్వహించడంలో విఫలమయ్యారని డీలర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

మిక్స్‌డ్ సాల్వెంట్ పక్కదారి!

... 5వ పేజీ తరువాయి

శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో పరీక్షించి అన్ని ప్రమాణాలు సరిపోయిన తరువాతే అన్‌లోడింగ్‌కు అనుమతిస్తారు. ప్రతి ట్యాంకు పరిశ్రమకు వచ్చేటప్పుడు 18 శాతం వ్యాట్ చెల్లించినట్టు ఇన్‌వాయిస్, ఇతర బిల్లులు ఉండాలి. ఇంత సుదీర్ఘమైన ప్రొసీజర్ పాటించాల్సి ఉన్నప్పటికీ హైదరాబాద్, చెన్నైకు చెందిన ముఠాలు అడ్డగోలుగా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి దాంట్లో మరికొన్ని రసాయనాలు కలిపి ఇండస్ట్రియల్ డీజిల్ అని చెప్పి వాహనదారులకు అమ్ముతున్నాయి. ప్రతిరోజు వందల లీటర్లు వినియోగించే కాంట్రాక్టర్లు, సెల్ టవర్లు, ఇతర ట్రాన్స్‌పోర్టు కంపెనీలతో ముందుగా మాట్లాడుకుని తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇలా సరఫరా చేసే ముఠా ట్యాంకర్లను మొబైల్ పెట్రోల్ బంకులుగా పిలుస్తుంటారు. మిక్స్‌డ్ సాల్వెంట్‌లో మరికొన్ని రసాయనాలు కలిపిన ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగించే వాహనాల జీవితకాలం పడిపోతుంది. వాటి నుంచి వచ్చే పొగ పర్యావరణానికి తీవ్ర ముప్పుగా ఉంటుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఈ ముఠాలు చేసే అడ్డగోలు వ్యాపారంతో ప్రభుత్వానికి ఏటా రూ.1,000 కోట్ల నుంచి రూ.1200 కోట్ల మేర ఆదాయానికి గండి పడుతుంది. కాగా పెందుర్తిలో పట్టుకున్న ఇండస్ట్రియల్ డీజిల్‌ను విజయవాడలో ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశాలలో పౌరసరఫరాల శాఖ అధికారులు 'నవీరా' కంపెనీపై 6-ఎ కేసు నమోదు చేశారు.

జంబో అజెండా!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చేశారు. తాజాగా ర్యాటిఫికేషన్ కోసం అజెండాలో ప్రతిపాదించడం విశేషం. ఏదైనా పనికి ముందుగా స్టాండింగ్‌కమిటీ ఆమోదం తీసుకుని టెండర్లు పిలవాలి. కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించాలి. కానీ పనులు అప్పగించేసిన ఎనిమిది నెలల తర్వాత స్టాండింగ్‌కమిటీ ఆమోదం కోరడం విడ్డూరంగా ఉందని అధికారులే అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి అంశాలను అజెండాలో అధికారులు ప్రతిపాదిస్తే కమిషనర్, మేయర్ అభ్యంతరం తెలపకుండా ఎలా సమ్మతిస్తున్నారో అర్థం కావడం లేదంటున్నారు.

మరిన్ని అంశాలివీ...

అనకాపల్లి జోన్‌లో ఫ్లెక్సీలను తొలగించేందుకు వీలుగా రోజువారి వేతనంపై ఐదుగురు కార్మికులను నియమించే అంశాన్ని అజెండాలో చేర్చారు. 71వ వార్డులో జీవీఎంసీ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి ఉత్సవం నిర్వహించేదుకు అనుమతి కోరుతూ అజెండాలో చేర్చారు. జోన్-6 పరిధిలోని 11 సులభ్ కాంప్లెక్స్‌లలో కేర్‌టేకర్లుగా పనిచేస్తున్న 22 మందికి వేతనాలు చెల్లించే అంశాన్నీ అజెండాలో చేర్చారు. బీచ్‌రోడ్డులో సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌కు ఇప్పుడున్న స్థలానికి ఆనుకుని 367 చదరపు గజాలను అదనంగా రూ.2.29 లక్షల నెలసరి అద్దెకు కేటాయించే అంశాన్ని ప్రతిపాదించారు. సాగర్‌నగర్‌లో మురుగునీరు సముద్రంలో చేరకుండా ఎస్‌టీపీలోకి తరలించేందుకు, మురుగునీటిలో వ్యర్థాలను వేరుచేసేందుకు స్టెయిన్‌లెస్‌స్టీల్ పాలీమెకనెట్ ఏర్పాటు అంశాన్ని అజెండాలో ఉంచారు. జీవీఎంసీ కార్యక్రమాలను డ్రోన్‌ద్వారా చిత్రీకరించేందుకు నెలకు రూ.25వేల వేతనానికి ఆపరేటర్‌ను ఎస్‌ఎల్‌ఎఫ్ ద్వారా నియమించుకునే అంశాన్ని చేర్చారు. ఈఏడాది జూన్21న నగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఏర్పాట్లు, సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన, పార్కింగ్ స్థలాలను చదనుచేయడం వంటి పనులకు చేసిన ఖర్చులను కాంట్రాక్టర్లకు చెల్లించే అంశాలను భారీగానే అజెండాలో చేర్చారు. ఇవికాకుండా వార్డుల్లో అభివృద్ధి పనులు, వివిధ జోన్‌ల పరిధిలో దుకాణాల వేలం, రోడ్డుమార్జిన్ల ఆశీలు వసూలు వేలం వంటి అంశాలను పొందుపరిచారు.

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 5న భారీ జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఏడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా ఉపాధికల్పనాధికారులు సూచించారు.

8న అప్రెంటిస్ మేళా

ఈ నెల 8న కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటి స్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.సోలమన్ తెలిపారు. ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన 25 ఏళ్ల లోపు వయసు కలిగిన యువత పాల్గొనవచ్చునన్నారు. స్టీల్‌ప్లాంట్, కోరమాండల్ తదితర కంపెనీలు ఎంపిక చేస్తాయన్నారు. అభ్యర్థులు 8న ఉదయం 9గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. సుమారు 260 మందికి అప్రంటిస్ శిక్షణ అందిస్తామన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెన్షన్లు పొందుతున్న వారంతా వచ్చేఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా వార్షిక ధ్రువీకరణ (లైఫ్) సర్టిఫికెట్లు జిల్లా, డివిజనల్, సబ్ ట్రెజరీల్లో అందజేయాలని జిల్లా ఖజానా అధికారి కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోగా అందజేసి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు పొందాలన్నారు. ఈ మేరకు పెన్షనర్ల అసోసియేషన్లు అవగాహన కల్పించాలని కోరారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడి మృతి



సూర్యారావు (ఫైల్ ఫొటో)

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :స్టీల్‌ప్లాంటు ఎంజీఎం యా ర్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన కె.సూర్యారావు (56) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడుగా పని చేస్తున్నాడు. బుధవారం ఎంజీఎం విభాగం వే బ్రిడ్జి వద్ద నిర్వహణ పనులు చేస్తుండగా వెనుకనుంచి వచ్చిన రైల్వే వ్యాగన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సూర్యారావు మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు(తెలుపు) 40,వంకాయలు(నలుపు) 48, గుత్తి/రవి వంకాయలు 48, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, బజ్జి పకోడి మిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళదు ంపలు 18, అరటికాయ (పె) 7, మునక్కాడ లు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబా టి 42, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్ద చిక్కుడు 40, దోసకాయలు 22, వెల్లుల్లి 64, కొబ్బరికాయ 35, బీట్‌రూట్ 44, బీన్స్ 56, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 58, గ్రీన్‌పీస్ బటాని 90, గోరు చిక్కుడు 50, కూ ర పెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, పాల కూర (కట్ట) 3, తోటకూర (క ట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గు మ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామ కాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక జాబ్‌మేళా

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్



చెస్‌పోటీల్లో జిల్లా విజేతగా నిలిచిన పెదగంట్యాడ మండలం వినాయక్‌నగర్ విద్యార్థిని జలజాక్షికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ హరింధర్‌ప్రసాద్

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభా వంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మూడు నెలలకోసారి ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, ఆర్థిక ప్రయోజనాల అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల అంతర్జాతీయ అంధుల క్రికెట్ మ్యాచ్‌లో కీలకంగా వ్యవహరించిన ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థిని కరుణ కుమారి ఆట తీరు ఆదర్శమన్నారు. అంగవైకల్యం ఉందని కుంగిపోకూడదని, నచ్చిన రంగంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం రూ. 5వేలు పింఛను అందిస్తోందని, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలకు పెంచిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, ఏడాదికి అదనంగా ఏడు రోజుల సెలవు, ముఖ ఆధారిత హాజరు మినహాయింపు తదితర వెసులుబాట్లు కల్పించదన్నారు. వైకల్యం ఉందని కుంగిపోవద్దని, మీ శక్తి సామర్థ్యాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. జిల్లాలో వికలాంగుల సంఘాలు ఐక్యంగా పనిచేస్తున్నాయన్నారు.సైన్ లాంగ్వేజిపై సాధారణ పౌరులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి ఎలాంటి సహాయమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్, యూసీడీ పీడీ సత్యవతి, సీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరికొత్త ప్రేమ కథా చిత్రం మోగ్లీ

» డిసెంబరు 12న విడుదల » నగరంలో చిత్ర యూనిట్ ప్రమోషన్



మాట్లాడుతున్న హీరో రోషన్, హీరోయిన్ సాక్షి, నటుడు హర్ష

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సరికొత్త ప్రేమ కథా చిత్రంగా మోగ్లీ సినిమా తెరకెక్కిందని హీరో రోషన్ కనకాల అన్నారు, యాంకర్ సుమ, రాజీవ్ కనకాల తనయుడు రోషన్ హీరోగా, సాక్షి హీరోయిన్‌గా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మోగ్లీ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్‌ను బుధవారం నగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ గ్రీన్ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో రోషన్ మాట్లాడుతూ మోగ్లీ కేవలం సినిమా కాదని యువత ఫీల్ అయ్యే కథ అన్నారు. సాధారణ యువకుడిగా తన పాత్ర కోసం చాలా పరిశోధన చేశానని, చిత్రం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. విశాఖపట్నం, పాడేరు తదితర ప్రాంతాల్లోనే ఎక్కువగా షూటింగ్ చేశామన్నారు. సినిమాలో హర్ష కామెడీ, కాలభైరవ సంగీతం హైలెట్‌గా నిలుస్తాయన్నారు. హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ విశాఖ చాలా ఇష్టమని మోగ్లీ చిత్ర ప్రచారం ఇక్కడ నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సినిమాలో తనది ఛాలెంజింగ్ రోల్ అని, ఎమోషన్‌తో కూడిన అందమైన ప్రేమ కథ అన్నారు, సమావేశంలో నటుడు హర్ష పాల్గొన్నారు.

హనుమంతుడికి ఘనంగా ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న అభయాంజనేయ స్వామి

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి సమీపంలో గల సింహగిరి కాలనీలో వెలసిన అభయాంజనేయస్వామి 9వ వార్షికోత్సవం పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ హనుమంతునికి లక్షసింధూర తమలపాకులతో పూజ చేశారు. స్వామికి వడల నివేదన చేసి వడమాలలు వేశారు. ఈ సందర్భంగా భక్తుల స్వహస్తాలతో పంచామృతాబిషేకాలు చేశారు. అనంతరం స్వామికి నూతన వస్త్రాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలో పాల్గొన్నారు.

అలాగే హనుమత్ ద్వాదశిని పురస్కరించుకొని చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ప్రాంగణంలో హనుమంతుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే శ్రీకాంత్‌నగర్‌లో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, చినగదిలిలో గల రామాంజనేయ ఆలయంలో భారీ హనుమంతుడికి, జీవీఎంసీ 10వ వార్డులోని రాజీవనగర్‌లో గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలో గల ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా బుధవారం హనుమద్ వ్రతం నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ అనంతరం భక్తుల మధ్య వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పదమూడు ముడులు, ఏడు దారాలతో కూడిన హనుమద్ తోరాణాలను భక్తులకు అందించారు.

ఎండాడలో డెంగ్యూ కేసు నమోదు

ఎండాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో డెంగ్యూకేసు నమోదయింది. పలు ప్రాంతాల్లో వైరల్ ఫీవర్, ఒళ్లు నొప్పులతో పలువరు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వ్యక్తికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో యూపీహెచ్‌సీ వైద్యులు అప్రమత్తమయ్యారు. జీవీఎంసీ శానిటేషన్, మలేరియా విభాగం అధికారులతో స్ప్రేయింగ్ చేయించారు.

అంపల్లరీ, పాంక్రియాటిక్ క్యాన్సర్లను సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమే..

» నారాయణ మెడిసిటీ ఎం.డి. డాక్టర్ టి.నారాయణరావు

» విజయవంతంగా విపుల్స్ పాంక్రియాటికోడ్ ఓడెనెక్టమి, పాంక్రియాటిక్ నెక్రోసెక్టమీ శస్త్రచికిత్స



చికిత్స చేయించుకున్న రోగి సోమనాథ్

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంపల్లరీ, పాంక్రి యాటిక్ క్యాన్సర్లను ముందుగా గుర్తించడం అత్యంత కీలకమని, సకాలంలో గుర్తించినట్లయితే వీటి నివారణ సాధ్యమేనని నారాయణ మెడిసిటీ ఎం.డి. డాక్టర్ టి.నారాయణరావు అన్నారు. ఈ వ్యాధులకు సమయానికి చికిత్స చేస్తే రోగుల దీర్ఘకాలిక జీవనావకాశాలు గణనీయంగా మెరుగవుతాయని పేర్కొన్నారు. అరుదైన అత్యంత క్లిష్టమైన విపుల్స్ పాంక్రియాటికోడ్ ఓడెనెక్టమితో పాటు పాంక్రియాటిక్‌నెక్రోసెక్టమీ శస్త్రచికిత్సను ఆస్పత్రిలో విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ సోమనాథ్ (59) అనే రోగికి ఈ క్లిష్టమైన చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. రోగి ప్రస్తుతం కోలుకుంటున్నాడని తెలిపారు. ఈ చికిత్సను ప్రముఖగ్యాస్ట్రోఇంటెస్టినల్, హెపాటో - పాంక్రియాటో-బిలియరీ శస్త్రచికిత్స నిపుణుడు నారాయణరావు, సహాయక శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ టి.ఆదిత్య, సీనియర్ అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ డి.విజయ్‌కుమార్ రావు నిర్వహించారు.

అప్పన్నకు రూ.1.66 కోట్ల ఆదాయం


సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామికి గత 21 రోజుల్లో ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కట్నకానుకల ద్వారా సుమారు రూ.1.66 కోట్ల ఆదాయం లభించింది. ఈవో ఎస్.సుజాత పర్యవేక్షణలో బుధవారం పరకామణి కేంద్రంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. ఇందులో నగదు రూపంలో రూ.1,66,01,951, బంగారం 61.15 గ్రాములు, వెండి 6.72 గ్రాములు, 397 యూఎస్ డాలర్లు, ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, సింగపూర్, ఖతార్, మలేషియా, భూటాన్, తదితర దేశాల కరెన్సీ ఖజానాకు చేరింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓలు వీబీ రమణమూర్తి, కె.తిరుమలేశ్వరరావు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘంకు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణభారతినగర్‌లో వైద్యశిబిరం

సాగర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరంతో పాటు గ్రామదత్తత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎండాడ మాజీ సర్పంచ్ చెన్నాదాసు ఒక ప్రకటనలో తెలిపారు. గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు వివిధ రోగాలకు స్పెషలిస్టు వైద్యులతో వైద్య సదుపాయం అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గీతం ఆస్పత్రి స్వర్ణభారతి నగర్‌ను దత్తత స్వీకారం స్వీకరిస్తుందని తెలిపారు.

ఆకట్టుకున్న గీతం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన

» టెక్నో సృజనాత్మకతను చాటిన ఇంజనీరింగ్ విద్యార్థులు » అధునాతన ఉపకరణాల ఆవిష్కరణ



ప్రదర్శనలో ఉంచిన పరికరాలతో ఇంజనీరింగ్ విద్యార్థులు

సాగర్‌నగర్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఇంజనీరింగ్ విద్యార్థులకు నూతనంగా ప్రారంభించిన టెక్నాలజీ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్ (టెప్) కోర్సులో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులు తమలోని వినూత్న ఆలోచనలను ఆకర్షణీయమైన ఇంజనీరింగ్ నమూనాల రూపంలో బుధవారం ప్రదర్శించారు. అధునాతన ఉపకరణాలతో పాటు 3డీ ప్రింటింగ్, డ్రిల్లింగ్, కటింగ్, గ్రైండింగ్, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు ఉపయోగించ రైతులకు ఉపయోగపడే పరికరాలు, ఇనుము, ప్లాస్టిక్‌లు , చెక్కతో సాంకేతిక ఉత్పత్తులను రూపొందించి వినూత్న ఆలోచనలను ఆవిష్కరించారు. గీతం ఇంజనీరింగ్ విద్యార్థులు దాదాపు 150 మంది బృందాలుగా ఏర్పడి దాదాపు 32కి పైగా సాంకేతిక ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

అగ్నిప్రమాదాల్లో రక్షించే రోబోట్, వర్షం నీటిని నిల్వ చేసే పరిజ్ఞానం, స్మార్ట్‌క్రీడా పరికరాలు, అంధులకు మార్గం చూపించే పరికరాలు, సౌరశక్తితో నడిచే పరికరాలు, ఎలక్ట్రికల్‌తో నడిచే గోకార్ట్ వాహనం, టెస్ట్ ట్యూబ్‌లను శుభ్రం చేసే వాషింగ్‌మిషన్లు, ఆకర్షణీయమైన వ్యవసాయ ఉపకరణాలు, పనిముట్లు, తీరప్రాంతాల పరిశుభ్రతకు ఉపయోగించే యంత్రాలు, వరదముప్పును గుర్తించే వంతెనలు-పరికరాలు, స్మార్ట్ పార్కింగ్, సౌర యంత్రాలను శుభ్రపరిచే సామాగ్రి చేతి సంజ్ఞల ఆధారంగా పని చేసే రోబోట్‌లు, వైద్య రంగంలో ఉపయోగపడే రోబో చేతి నమూనాలు యంత్రాలను ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు తమ కోర్సులో అభ్యసించిన అంశాల ఆధారంగా సెన్సార్లు, మోటార్లు, మైక్రోకంట్రోలర్లు తప్పనిసరిగా ఉపయోగిస్తూ అవసరమైన చోట 3డీ ప్రింటింగ్ ద్వారా తమ సాంకేతిక నమూనాలు ప్రదర్శనలో ఉంచారు.

గీతం ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వైగౌతమ్‌రావు, ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరై విద్యార్థులను అభినందించారు. గీతం మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.అత్యుత్తమ ఇంజనీరింగ్ నమూనాలను గుర్తించి నగదు బహుమతులు , సర్టిఫికెట్లు అందజేశారు.



రూపొందించిన పరికరాన్ని ఆపరేట్ చేసి చూపుతున్న విద్యార్థులు



జోన్-4 కార్యాలయంలో ప్రారంభానికి సిద్ధమైన విశాఖ డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం

నేడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం

» ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల ఏర్పాటు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు గురువారం ప్రారంభం కానున్నాయి. విశాఖ డివిజనల్ కార్యాలయాన్ని జగదాంబ జంక్షన్ సమీప జోన్-4 కార్యాలయంలో ఏర్పాటుచేశారు. గతంలో మీ-సేవా కార్యాలయంగా ఉన్న ఫ్లోర్‌నే కేటాయించారు. భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరులో సొంత భవనాలు సిద్ధం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం ఉదయం 11 గంటలకు చిత్తూరు జిల్లా నుంచి డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేస్తారు. డీడీవో కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, మండల పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు హాజరవుతాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు.

15వ వార్డులో రోడ్లు, పార్కు అభివృద్ధికి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవిద్య, పలువురు అధికారులు, కూటమి నేతలు

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.87 లక్షలతో రోడ్లు, ఏపీఎస్ఈబీ కాలనీ పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. డాక్టర్స్ కాలనీలోని ఏపీఎస్ఈబీ కాలనీలోని పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, టీడీపీ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరుగున పడేసిన పార్కులు, రోడ్ల అభివృద్ధిని ముందుకు తీసుకు వెళుతున్నట్టు చెప్పారు. కార్పొరేటర్ శ్రీవిద్య మాట్లాడుతూ రూ.18 లక్షలతో పార్కు రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాచ్‌మన్ రూమ్ నిర్మాణం చేస్తున్నామని, మిగిలిన వ్యయంతో కాలనీలోని హెచ్‌బీ కాలనీ, జేఆర్‌నగర్ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు సీనియర్ నాయకులు బోర ధనరెడ్డి, ఉపాధ్యక్షుడు బోను సూరిబాబు, ప్రభుత్వ న్యాయవాది బుగత సత్యనారాయణ, జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత జ్ఞాన సాయి, ఉపాధ్యక్షులు ఆర్.నారాయణ, ఇతర నాయకులు, జీవీఎంసీ అధికారులు డీఈ భాగ్యశ్రీ, ఏఈ చందు, ఏపీఎస్ఈబీ కాలనీ ఛైర్మన్ కె.రామారావు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' యాజమాన్యం కార్మిక సంఘాల మధ్య చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉక్కు యాజమాన్యం అధికారులు, కార్మిక నాయకుల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ గణేషన్ సమక్షంలో బుధవారం నగరంలోని ఆర్ఎల్సీ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఇందుకు సంబంధించి కార్మిక నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉత్పత్తి ఆధారంగా వేతనాలు ఇచ్చారని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను రద్దు చేశారని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు కార్మిక నాయకులు తెలిపారు. అయితే ప్లాంట్ క్లిష్టమైన దశలో ఉందని, సమస్యల పరిష్కారానికి ఇంకో రోజు కేటాయించారని వారు తెలిపారు.

15 నాటికి కొత్త జోనల్ కార్యాలయాలు సిద్ధం చేయండి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



మాధవధార జోనల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో కొత్తగా ఏర్పాటుచేస్తున్న ఉత్తర నియోజకవర్గం, అగనంపూడి జోనల్ కార్యాలయ భవనాలను ఈనెల 15 నాటికి సిద్ధం చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుత ఎనిమిది జోన్‌లను పది జోన్లకు పెంచుతూ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న జోనల్ కార్యాలయ భవనాలు ఎనిమిది జోన్లకు సరిపోతుండడంతో కొత్తగా ఏర్పాటయ్యే ఉత్తర నియోజకవర్గం జోన్‌కు మాధవ ధార వుడాలేఅవుట్‌లో భవనం నిర్మిస్తున్నారు. అలాగే అగనంపూడి జోన్‌కు తాత్కాలికంగా 85వ వార్డు పరిధిలోని రాజీవ్‌గాంధీ కల్యాణమండపంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటయ్యే జోనల్‌కార్యాలయాలకు ఇప్పటికే అధికారులు, సిబ్బందిని కేటాయించడంతో వీలైనంత వేగంగా జోన్‌లను అందుబాటులోకి తేవాలని కమిషనర్ భావిస్తున్నారు. ఇందులోభాగంగా మాధవధార వుడాలేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఉత్తర నియోజకవర్గం జోన్ కార్యాలయం భవనాన్ని బుధవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలో భవన నిర్మాణపనులు పూరవుతాయని, విభాగాల వారీగా బోర్డులు, అధికారుల నేమ్‌ప్లేట్‌లు, జోనల్‌కార్యాలయాన్ని ప్రజలు గుర్తుపట్టేందుకు వీలుగా గ్లోసైన్‌బోర్డులు, ఏసీలు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని జోనల్‌కమిషనర్ రామును ఆదేశించారు. అనగంపూడి జోన్ కార్యాలయం ఏర్పాటుచేసే 85వ వార్డులోని కల్యాణ మండపాన్ని కూడా పరిశీలించారు. కొత్తభవనం అందుబాటులోకి వచ్చేవరకు తాత్కాలిక ఏర్పాట్లను ఈనెల 15నాటికి పూర్తిచేయాలని చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజుని ఆదేశించారు. లాండ్‌స్కేప్‌తోపాటు సమావేశాల నిర్వహణకు గది, కంప్యూటర్లు, పార్కింగ్ కోసం షెడ్ నిర్మించాలన్నారు. జ్ఞానాపురంలో ఉన్న పశ్చిమ నియోజకవర్గం జోనల్‌కార్యాలయాన్ని ఎన్ఏడీ కొత్తరోడ్డు సమీపంలో నిర్మించేందుకు అనువైన స్థలం గుర్తించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

రైల్వేలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న 72వ అఖిల భారత పురుషుల, మహిళల రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ టోర్నీలో పాల్గొంటున్న 15 జోన్‌లు, ప్రొడక్షన్ యూనిట్లకు చెందిన సుమారు 160 మంది లిఫ్టర్లు కవాతు నిర్వహించి క్రీడా వందనం సమర్పించారు. అనంతరం డీఆర్ఎం లలిత్ బొహ్రా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని అభినందించారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ వంటి టోర్నీల్లో దేశానికి పతకాలు అందించి భారతీయ రైల్వేల ఖ్యాతిని పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు ఈ.శాంతారామ్, కె.రామారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, ద్రోణాచార్య అవార్డీ సునీల్‌కుమార్, వాల్తేరు రైల్వే వెయిట్ లిఫ్టింగ్ ప్రతినిధులు సురేష్, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

అండర్-16 ఆంధ్ర క్రికెట్ జట్టు కోచ్‌గా త్రినాథ్ యాదవ్



విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆలిండియా అండర్-16 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టు కోచ్‌గా నగరానికి చెందిన పల్లా త్రినాథ్ యాదవ్‌ను నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ సంఘం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 6 నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న ఈ టోర్నీలో ఆంధ్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తాడు. త్రినాథ్ యాదవ్‌ను సీనియర్ క్రికెటర్లు, కోచ్‌లు అభినందించారు.

27 నుంచి ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు



విద్యార్థులతో అతిథులు

సీతమ్మధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల మైదాన ప్రాంగణంలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.మనోజ్ తెలిపారు. క్రీడా పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీనటుడు ఐనవోలు ప్రసన్నకుమార్ లోగోను ఆవిష్కరించారు. విద్యార్థులు జానపద, శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు ఆర్‌వీవీ సత్యనారాయణ, జానపద కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సీతంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి రామాటాకీస్ డౌన్ రోడ్డులో సుంకర రాజా అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి మరో వాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆయన రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుంకర రాజా కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు.

ప్రణాళికాబద్ధంగా పరిశ్రమిస్తేనే ఉన్నత లక్ష్యం సాధ్యం

» పోటీ పరీక్షల అభ్యర్థులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉద్బోధ



పౌరగ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థులతో సంభాషిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సీతంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ వంటి ఉన్నత లక్ష్యం సాధించాలనుకున్నప్పుడు ఓ ఆరు నెలలో, ఏడాదో పరీక్షల కోసం చదివితే ఫలితం ఉండదని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పష్టంచేశారు. విద్యార్థి దశ ప్రారంభం నుంచే నిరంతరం శ్రమించాలని సూచించారు. ఆత్మ విశ్వాసం తప్ప అతి విశ్వాసం కూడదని, పరీక్షల్లో ఒక మార్కు కూడా భవిష్యత్తును నిర్ణయించగలదని పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల విశాఖ పౌరగ్రంథాలయాన్ని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం సందర్శించి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. గ్రంథాలయం కార్యదర్శి డీఎస్ వర్మ, లైబ్రేరియన్ దుర్గారాణి గ్రంథాలయంలోని వివిధ విభాగాలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అధ్యయనం చేస్తున్న అభ్యర్థులు, విద్యార్థులతో కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం అక్కడి హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఐఏఎస్ సాధించే వరకు తన ప్రస్థానంలోని పలు అంశాలను ఆసక్తి కరంగా వివరించారు. సాధారణ విద్యార్థి అయిన తాను ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తన తల్లిదండ్రుల మార్గదర్శనం, ప్రోత్సాహంతో కఠినంగా పరిశ్రమించి ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. వివిధ అంశాలపై మౌలిక పరిజ్ఞానం తొలుత పొందాలని, ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ దశల్లో సన్నద్ధత ఎలా ఉండాలో విశ్లేషించారు. గ్రంథాలయంలో చదువుకోవడానికి ఉత్తమ వాతావరణం ఉందని, ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని హితవు పలికారు. ఉన్నత ప్రమాణాలతో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న పాలక వర్గాన్ని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ, సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు శాలువా కప్పి సన్మానించారు.

డిప్యూటీ స్పీకర్‌ను పదవి నుంచి తొలగించాలని విదసం డిమాండ్



సమావేశంలో పాల్గొన్న విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు, ఇతర ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు ఎగవేసి ఆర్థిక నేరస్థుడిగా సీబీఐ కేసులో నిందితుడైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును తక్షణమే అరెస్టు చేసి, పదవి నుంచి తొలగించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవన్ ఆవరణలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని డీఓపీటీకి ఫిర్యాదు చేయడం గురివింద గింజ వైఖరి అని విమర్శించారు. రాష్ట్రపతి స్పందించి డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి తొలగించాలని బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై వ్యక్తిగత కక్షతో ఆయన మాటలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. దళితులు, కాపులు ఏకం కావలసి ఉందన్నారు. జాజి ఓంకార్, సోదదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, శేఖర్, ఆల్యండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వరకు స్వాములకు భిక్ష

అక్కయ్యపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలో గల షిర్డీ సాయిబాబా ధాన్యమందిరంలో సంక్రాంతి వరకు మాల ధరించినవారికి భిక్ష ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. గురువారం నాటికి 41 రోజుల మండల కాలంలో 15 వేల మంది స్వాములకు భిక్ష ఏర్పాటు చేశామన్నారు. దాతలు కార్యాలంలో సంప్రదించాలని సూచించారు.

జీవో 129తో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం



జీవో 129 ప్రతిని చూపుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, అసోసియేషన్ ప్రతినిధులు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ)కు శాశ్వత సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యత్వం కల్పిస్తూ ప్రభుత్వం జీవో 129 జారీ చేయడం వల్ల ఆర్టీసీ కార్మికులకు మేలు జరుగుతుందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, ఆర్టీసీ ఎన్ఎంయూఏ రీజనల్ గౌరవాధ్యక్షుడు పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. ప్రభుత్వం ఈ జీవో జారీచేయడం పట్ల ఎన్ఎంయూఏ నాయకులు ఆనందం వ్యక్తంచేస్తూ బుధవారం విష్ణుకుమార్‌రాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలా కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. 129జీవో జారీకి కృషిచేసిన అసోసియేషన్ నాయకులను అభినందించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు, కోశాధికారి పీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ఫ్యాన్ల వితరణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వాసవీ క్లబ్ స్మార్ట్ విశాఖ డైమండ్స్ స్వచ్ఛంద సంస్థ ఐదు ఫ్యాన్లు, విద్యార్థినులకు నోట్ పుస్తకాలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్.మంజుల తెలిపారు. వారి సేవా నిరతి అభినందనీయమన్నారు. క్లబ్ గవర్నర్ అమర్‌నాథ్, ప్రెసిడెంట్ మానస, సభ్యులు పాల్గొన్నారు.

జూ అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ప్రణాళికలు బాగుంటాయో గుర్తించి, వారిని కన్సల్టెంట్‌గా నియమిస్తారు. ఆ తరువాత ప్రణాళికాబద్ధంగా వాటిని అభివృద్ధి చేస్తారు. వీటికి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చక్కగా చదువుకుని నవసమాజ నిర్మాణానికి కృషి చేద్దామని నినదిస్తూ పాఠశాల విద్యార్థులతో మహారాణిపేట పోలీసులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం 29వ వార్డులో దండుబజారు జంక్షన్ వద్ద ఎంపీడీఎం పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. సీఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

కవిత్వం సమాజ దిక్సూచి కావాలి



ప్రసంగిస్తున్న రచయిత్రి రాధారాణి

సీతంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో కవుల స్వీయ కవితా పఠనం, సమ్మేళన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు రచయితలు మాట్లాడుతూ కవిత్వం సమాజ దిక్సూచి కావాలన్నారు. ప్రతి కవిత భావావిష్కరణతో ఆలోచింపజేసేదిగా ఉండాలన్నారు. కవి చప్పట్లు తప్ప ఇంకేమీ కోరుకోడంటూ, అతని మనస్సును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కె.జి.వేణు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ దేవులపల్లి పద్మజ, బి.రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక: సునీల్ అహీరా



వేదికపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సునీల్ అహీరా తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల అభీష్టం మేరకు, మెజారిటీ నిర్ణయంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపిక చేయనున్నట్లు ఏఐసీసీ అధికార ప్రతినిధి, విశాఖ జిల్లా పరిశీలకుడు సునీల్ అహీరా అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు విశాఖ వచ్చానని తెలిపారు. జిల్లాలో నాయకులు పార్టీని వీడినా క్యాడర్ చెక్కుచెదరలేదని అహీరా అన్నారు. కొత్త అధ్యక్షుడి ఎంపిక తరువాత పార్టీ బలోపేతంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు అమర్‌జా బేగం, మార్టిన్ లూథర్, వేగి వెంకటేశ్, కమలాకర్, హాసినీ వర్మ, ప్రియాంకా దండి, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ఏఎంసీ



వాలీబాల్, టెన్నిస్ విజేతలతో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 26వ అంతర్ వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాజమండ్రి జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన వాలీబాల్ టోర్నీలో అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం, చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. టెన్నిస్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పతక సాధకులను బుధవారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం.సంధ్యాదేవి తన కార్యాలయం వద్ద అభినందించారు. ఏఎంసీ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.చంద్రశేఖర్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు, కార్యదర్శి ఎన్.భానుసతీష్ తదితరులు పాల్గొన్నారు.

'విభిన్న ప్రతిభావంతులకు ఆత్మవిశ్వాసమే ఆయుధం'



అక్కయ్యపాలెం భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు



డాబాగార్డెన్స్‌లో 'ది ఎబిలిటీ పీపుల్ ఫౌండర్' ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం



కలెక్టరేట్ వద్ద దివ్యాంగ విద్యార్థులతో అతిథులు

అక్కయ్యపాలెం/మహారాణిపేట/డాబాగార్డెన్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆత్మస్థైర్యంతో అడుగేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పలువురు ఉద్ఘాటించారు. అక్కయ్యపాలెంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు డి.రామారావు, బాలామణి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు జయంతి రాధాకుమారి, కనకమహాలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఈవో బాలామణి మాట్లాడుతూ దివ్యాంగులుగా జన్మించడం శాపంగా భావించొద్దని, వారిని భవిత కేంద్రానికి పంపాలన్నారు. భవిత కేంద్రం టీచర్లు శారద, జగదాంబ తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్‌లోని మహారాణిపేట భవిత కేంద్రం, కలెక్టరేట్ జంక్షన్ సమీపంలోని జీవీఎంసీ అచ్యుతరామ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. తొలుత దివ్యాంగులు, సాధారణ పిల్లలతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ పోటీలు జరిగాయి. భవిత కేంద్రం అందజేస్తున్న వివిధ రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైకల్యం గల పిల్లల్లో సామర్థ్యం అంతర్లీనంగా ఉంటుందని, ప్రత్యేక బోధన పద్ధతులతో బయటకు తీయాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు పి.పైడపు నాయుడు, పుష్యరాగం, వి.శ్వేతలత, డి.ప్రతిమా, ప్రియా, జ్యోతి, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలు ఉంటాయని, ఇందుకు తననే ఉదాహరణగా తీసుకోవాలని 'ది ఎబిలిటీ పీపుల్ ఫౌండర్ డైరెక్టర్ దిలీప్ పాత్రో అన్నారు. డాబాగార్డెన్స్ డ్వాక్రాబజార్‌లో విభిన్న ప్రతిభావంతులతో కలివిడిగా మాట్లాడారు. కృత్రిమ అవయవాలు వినియోగించే విధానం తెలియజేశారు. దృఢసంకల్పంతో ముందుకు వెళ్తే జీవితంలో గొప్పస్థాయిలో కూర్చొనే అవకాశం కలుగుతుందన్నారు. 'ది ఎబిలిటీ పీపుల్ అధ్యక్షుడు పడాల విజయశంకర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. అనంతరం పలువురికి ఉచితంగా చక్రాల కుర్చీలు, కృత్రిమ పరికరాలను పంపిణీ చేశారు.

రేపటి నుంచి విశాఖ, బ్రహ్మపూర్, పలాస రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని గరివిడి, జి.సిగడాం, చీపురుపల్లి సెక్షన్‌లలో ఆధునికీకరణ పనులు చేపడుతున్నందున పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. వీటిలో ఈ నెల 5, 7 తేదీల్లో విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), ఈ నెల 6, 8 తేదీల్లో బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531)లు రద్దు చేశామన్నారు. అలాగే ఈ నెల 6, 7 తేదీల్లో విశాఖ-పలాస మధ్య నడిచే 67289, 67290 నంబర్లు గల మెము పాసింజర్ రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు.

బెనారస్ స్టేషన్ కోడ్ మార్పు

నార్త్ ఈస్టర్న్ రైల్వే జోన్, వారణాసి డివిజన్‌లోని బెనారస్ స్టేషన్ కోడ్‌ను బీఎస్‌బీఎస్ నుంచి బీఎన్ఆర్ఎస్‌గా మార్పు చేశామని, కొత్త కోడ్ ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చిందని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ పేర్కొన్నారు.

'స్నేహ' మ్యాక్స్ వ్యవస్థాపకుడు శివభాగ్యారావు అరెస్టు

» నిందితుడు రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి

గోపాలపట్నం (విశాఖపట్నం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'స్నేహ' మ్యాక్స్ సొసైటీ పేరుతో పలువురి నుంచి డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించకుండా పరారైన సంస్థ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి శివభాగ్యారావును ఎట్టకేలకు గోపాలపట్నం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..స్నేహ మ్యాక్స్ సొసైటీ పేరుతో సంస్థను స్థాపించిన శివభాగ్యారావు పలువురి నుంచి రూ.3.13 కోట్లు డిపాజిట్లు సేకరించారు. అయితే గడువు ముగిసినప్పటికీ సొమ్మును తిరిగి చెల్లించడం లేదంటూ 15 మంది ఖాతాదారులు ఈ ఏడాది ఆగస్టులో గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు అప్పటికే పరారీలో ఉన్న శివభాగ్యారావు కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హైదరాబాద్‌లో శివ భాగ్యారావుతో పాటు సంస్థలో భాగస్వామి అయిన అతడి కుమారుడు క్రాంతిని అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరినీ నగరానికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపారు.

ఉక్కు మంత్రి కుమారస్వామితో ఎంపీ శ్రీభరత్ భేటీ

పెదవాల్తేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం పరిరక్షణకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డి కుమారస్వామికి ఎంపీ ఎం.శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్‌లతో కలిసి కేంద్ర మంత్రిని కలిశారు. ఉక్కు కర్మాగార భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. నిర్ణయాలు ఆలస్యం కాకుండా ఉండేందుకు పూర్తిస్థాయి చైర్మన్‌ను, డైరెక్టర్లను తక్షణం నియమించాల్సిన అవసరం ఉన్నదని మంత్రికి ఎంపీ వివరించారు. అలాగే దీర్ఘకాలిక స్థిరత్వం కోసం సెయిల్ ఆధ్వర్యంలోకి విశాఖ ఉక్కును తీసుకువెళ్లేందుకు గల అవకాశాలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ అంశాలన్నింటిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. విశాఖ ఉక్కు కర్మాగారంతోపాటు ఉద్యోగుల ప్రయోజనాల కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ శ్రీభరత్ అన్నారు.

అవినీతిలో ఘనుడు

... 5వ పేజీ తరువాయి

ఎంపిఈలో అక్రమాలకు పాల్పడుతుంటారనే ఫిర్యాదులు ఉన్నాయి.

సర్కిల్-3 పరిధిలో 130 రేషన్ డిపోలు ఉన్నాయి. ప్రతి డిపో నుంచి నెలకు రెండు వేల వంతున మామూళ్లు వసూలు చేస్తున్నట్టు డీలర్లే చెబుతున్నారు. ప్రధానంగా బినామీ డిపోలకు సంబంధించి అక్రమాలకు ప్రోత్సహించారనే వాదన ఉంది. దీనికి అదనంగా నెలకు ఐదు వేల రూపాయల వరకూ తీసుకుంటున్నారు. అదేవిధంగా సర్కిల్-3లో కొన్ని షాపులను రేషన్ డీలర్ల సంఘం నేత ఒకరితో కలిసి ఏఎస్‌వోనే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఈ వ్యవహారం నడుపుతున్నారంటున్నారు. ఇంకా డిపోల ద్వారా పంపిణీ చేసే బియ్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే మాఫియాతో ఏఎస్‌వోకు సన్నిహిత సంబంధాలున్నాయి. రైస్ మిల్లర్ల నుంచి భారీగా మామూళ్లు తీసుకుంటున్నారని, అందుకే వారి అక్రమాలను చూసీచూడనట్టు వదిలేస్తున్నారని గాజువాక ప్రాంతానికి చెందిన డీలర్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందితే గత్యంతరం లేక డిపో లేదా అక్రమ బియ్యం తరలిస్తున్న వాహనాలపై కేసులు పెడుతుంటారు తప్ప అధికారిగా తన విధులు నిర్వహించడంలో విఫలమయ్యారని డీలర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

మిక్స్‌డ్ సాల్వెంట్ పక్కదారి!

... 5వ పేజీ తరువాయి

శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో పరీక్షించి అన్ని ప్రమాణాలు సరిపోయిన తరువాతే అన్‌లోడింగ్‌కు అనుమతిస్తారు. ప్రతి ట్యాంకు పరిశ్రమకు వచ్చేటప్పుడు 18 శాతం వ్యాట్ చెల్లించినట్టు ఇన్‌వాయిస్, ఇతర బిల్లులు ఉండాలి. ఇంత సుదీర్ఘమైన ప్రొసీజర్ పాటించాల్సి ఉన్నప్పటికీ హైదరాబాద్, చెన్నైకు చెందిన ముఠాలు అడ్డగోలుగా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి దాంట్లో మరికొన్ని రసాయనాలు కలిపి ఇండస్ట్రియల్ డీజిల్ అని చెప్పి వాహనదారులకు అమ్ముతున్నాయి. ప్రతిరోజు వందల లీటర్లు వినియోగించే కాంట్రాక్టర్లు, సెల్ టవర్లు, ఇతర ట్రాన్స్‌పోర్టు కంపెనీలతో ముందుగా మాట్లాడుకుని తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇలా సరఫరా చేసే ముఠా ట్యాంకర్లను మొబైల్ పెట్రోల్ బంకులుగా పిలుస్తుంటారు. మిక్స్‌డ్ సాల్వెంట్‌లో మరికొన్ని రసాయనాలు కలిపిన ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగించే వాహనాల జీవితకాలం పడిపోతుంది. వాటి నుంచి వచ్చే పొగ పర్యావరణానికి తీవ్ర ముప్పుగా ఉంటుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఈ ముఠాలు చేసే అడ్డగోలు వ్యాపారంతో ప్రభుత్వానికి ఏటా రూ.1,000 కోట్ల నుంచి రూ.1200 కోట్ల మేర ఆదాయానికి గండి పడుతుంది. కాగా పెందుర్తిలో పట్టుకున్న ఇండస్ట్రియల్ డీజిల్‌ను విజయవాడలో ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశాలలో పౌరసరఫరాల శాఖ అధికారులు 'నవీరా' కంపెనీపై 6-ఎ కేసు నమోదు చేశారు.

జంబో అజెండా!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చేశారు. తాజాగా ర్యాటిఫికేషన్ కోసం అజెండాలో ప్రతిపాదించడం విశేషం. ఏదైనా పనికి ముందుగా స్టాండింగ్‌కమిటీ ఆమోదం తీసుకుని టెండర్లు పిలవాలి. కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించాలి. కానీ పనులు అప్పగించేసిన ఎనిమిది నెలల తర్వాత స్టాండింగ్‌కమిటీ ఆమోదం కోరడం విడ్డూరంగా ఉందని అధికారులే అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి అంశాలను అజెండాలో అధికారులు ప్రతిపాదిస్తే కమిషనర్, మేయర్ అభ్యంతరం తెలపకుండా ఎలా సమ్మతిస్తున్నారో అర్థం కావడం లేదంటున్నారు.

మరిన్ని అంశాలివీ...

అనకాపల్లి జోన్‌లో ఫ్లెక్సీలను తొలగించేందుకు వీలుగా రోజువారి వేతనంపై ఐదుగురు కార్మికులను నియమించే అంశాన్ని అజెండాలో చేర్చారు. 71వ వార్డులో జీవీఎంసీ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి ఉత్సవం నిర్వహించేదుకు అనుమతి కోరుతూ అజెండాలో చేర్చారు. జోన్-6 పరిధిలోని 11 సులభ్ కాంప్లెక్స్‌లలో కేర్‌టేకర్లుగా పనిచేస్తున్న 22 మందికి వేతనాలు చెల్లించే అంశాన్నీ అజెండాలో చేర్చారు. బీచ్‌రోడ్డులో సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌కు ఇప్పుడున్న స్థలానికి ఆనుకుని 367 చదరపు గజాలను అదనంగా రూ.2.29 లక్షల నెలసరి అద్దెకు కేటాయించే అంశాన్ని ప్రతిపాదించారు. సాగర్‌నగర్‌లో మురుగునీరు సముద్రంలో చేరకుండా ఎస్‌టీపీలోకి తరలించేందుకు, మురుగునీటిలో వ్యర్థాలను వేరుచేసేందుకు స్టెయిన్‌లెస్‌స్టీల్ పాలీమెక్‌నెట్ ఏర్పాటు అంశాన్ని అజెండాలో ఉంచారు. జీవీఎంసీ కార్యక్రమాలను డ్రోన్‌ద్వారా చిత్రీకరించేందుకు నెలకు రూ.25వేల వేతనానికి ఆపరేటర్‌ను ఎస్ఎల్ఎఫ్ ద్వారా నియమించుకునే అంశాన్ని చేర్చారు. ఈఏడాది జూన్21న నగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఏర్పాట్లు, సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన, పార్కింగ్ స్థలాలను చదనుచేయడం వంటి పనులకు చేసిన ఖర్చులను కాంట్రాక్టర్లకు చెల్లించే అంశాలను భారీగానే అజెండాలో చేర్చారు. ఇవికాకుండా వార్డుల్లో అభివృద్ధి పనులు, వివిధ జోన్‌ల పరిధిలో దుకాణాల వేలం, రోడ్డుమార్జిన్ల ఆశీలు వసూలు వేలం వంటి అంశాలను పొందుపరిచారు.

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 5న భారీ జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఏడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా ఉపాధికల్పనాధికారులు సూచించారు.

8న అప్రెంటిస్ మేళా

ఈ నెల 8న కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో అప్రంటి స్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.సోలమన్ తెలిపారు. ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన 25 ఏళ్ల లోపు వయసు కలిగిన యువత పాల్గొనవచ్చునన్నారు. స్టీల్‌ప్లాంట్, కోరమాండల్ తదితర కంపెనీలు ఎంపిక చేస్తాయన్నారు. అభ్యర్థులు 8న ఉదయం 9గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. సుమారు 260 మందికి అప్రంటిస్ శిక్షణ అందిస్తామన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెన్షన్లు పొందుతున్న వారంతా వచ్చేఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా వార్షిక ధ్రువీకరణ (లైఫ్) సర్టిఫికెట్లు జిల్లా, డివిజనల్, సబ్ ట్రెజరీల్లో అందజేయాలని జిల్లా ఖజానా అధికారి కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోగా అందజేసి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు పొందాలన్నారు. ఈ మేరకు పెన్షనర్ల అసోసియేషన్లు అవగాహన కల్పించాలని కోరారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడి మృతి



సూర్యారావు (ఫైల్ ఫొటో)

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :స్టీల్‌ప్లాంటు ఎంజీఎం యార్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన కె.సూర్యారావు (56) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడుగా పని చేస్తున్నాడు. బుధవారం ఎంజీఎం విభాగం వే బ్రిడ్జి వద్ద నిర్వహణ పనులు చేస్తుండగా వెనుకనుంచి వచ్చిన రైల్వే వ్యాగన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సూర్యారావు మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ).
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు(తెలుపు) 40,వంకాయలు(నలుపు) 48, గుత్తి/రవి వంకాయలు 48, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, బజ్జి పకోడి మిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళదుంపలు 18, అరటికాయ (పె) 7, మునక్కాడ లు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబాటి 42, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్ద చిక్కుడు 40, దోసకాయలు 22, వెల్లుల్లి 64, కొబ్బరికాయ 35, బీట్‌రూట్ 44, బీన్స్ 56, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 58, గ్రీన్‌పీస్ బటాని 90, గోరు చిక్కుడు 50, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక జాబ్‌మేళా

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్



చెస్‌పోటీల్లో జిల్లా విజేతగా నిలిచిన పెదగంట్యాడ మండలం వినాయక్‌నగర్ విద్యార్థిని జలజాక్షికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ హరింధర్‌ప్రసాద్

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభా వంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మూడు నెలలకోసారి ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, ఆర్థిక ప్రయోజనాల అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల అంతర్జాతీయ అంధుల క్రికెట్ మ్యాచ్‌లో కీలకంగా వ్యవహరించిన ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థిని కరుణ కుమారి ఆట తీరు ఆదర్శమన్నారు. అంగవైకల్యం ఉందని కుంగిపోకూడదని, నచ్చిన రంగంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం రూ. 5వేలు పింఛను అందిస్తోందని, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలకు పెంచిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, ఏడాదికి అదనంగా ఏడు రోజుల సెలవు, ముఖ ఆధారిత హాజరు మినహాయింపు తదితర వెసులుబాట్లు కల్పించదన్నారు. వైకల్యం ఉందని కుంగిపోవద్దని, మీ శక్తి సామర్థ్యాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. జిల్లాలో వికలాంగుల సంఘాలు ఐక్యంగా పనిచేస్తున్నాయన్నారు.సైన్ లాంగ్వేజిపై సాధారణ పౌరులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి ఎలాంటి సహాయమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్, యూసీడీ పీడీ సత్యవతి, సీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరికొత్త ప్రేమ కథా చిత్రం మోగ్లీ

» డిసెంబరు 12న విడుదల » నగరంలో చిత్ర యూనిట్ ప్రమోషన్



మాట్లాడుతున్న హీరో రోషన్, హీరోయిన్ సాక్షి, నటుడు హర్ష

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సరికొత్త ప్రేమ కథా చిత్రంగా మోగ్లీ సినిమా తెరకెక్కిందని హీరో రోషన్ కనకాల అన్నారు, యాంకర్ సుమ, రాజీవ్ కనకాల తనయుడు రోషన్ హీరోగా, సాక్షి హీరోయిన్‌గా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మోగ్లీ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్‌ను బుధవారం నగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ గ్రీన్ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో రోషన్ మాట్లాడుతూ మోగ్లీ కేవలం సినిమా కాదని యువత ఫీల్ అయ్యే కథ అన్నారు. సాధారణ యువకుడిగా తన పాత్ర కోసం చాలా పరిశోధన చేశానని, చిత్రం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. విశాఖపట్నం, పాడేరు తదితర ప్రాంతాల్లోనే ఎక్కువగా షూటింగ్ చేశామన్నారు. సినిమాలో హర్ష కామెడీ, కాలభైరవ సంగీతం హైలెట్‌గా నిలుస్తాయన్నారు. హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ విశాఖ చాలా ఇష్టమని మోగ్లీ చిత్ర ప్రచారం ఇక్కడ నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సినిమాలో తనది ఛాలెంజింగ్ రోల్ అని, ఎమోషన్‌తో కూడిన అందమైన ప్రేమ కథ అన్నారు, సమావేశంలో నటుడు హర్ష పాల్గొన్నారు.

హనుమంతుడికి ఘనంగా ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న అభయాంజనేయ స్వామి

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి సమీపంలో గల సింహగిరి కాలనీలో వెలసిన అభయాంజనేయస్వామి 9వ వార్షికోత్సవం పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ హనుమంతునికి లక్షసింధూర తమలపాకులతో పూజ చేశారు. స్వామికి వడల నివేదన చేసి వడమాలలు వేశారు. ఈ సందర్భంగా భక్తుల స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి నూతన వస్త్రాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలో పాల్గొన్నారు.

అలాగే హనుమత్ ద్వాదశిని పురస్కరించుకొని చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ప్రాంగణంలో హనుమంతుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే శ్రీకాంత్‌నగర్‌లో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, చినగదిలిలో గల రామాంజనేయ ఆలయంలో భారీ హనుమంతుడికి, జీవీఎంసీ 10వ వార్డులోని రాజీవనగర్‌లో గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలో గల ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా బుధవారం హనుమద్ వ్రతం నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ అనంతరం భక్తుల మధ్య వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పదమూడు ముడులు, ఏడు దారాలతో కూడిన హనుమద్ తోరాణాలను భక్తులకు అందించారు.

ఎండాడలో డెంగ్యూ కేసు నమోదు

ఎండాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో డెంగ్యూకేసు నమోదయింది. పలు ప్రాంతాల్లో వైరల్ ఫీవర్, ఒళ్లు నొప్పులతో పలువరు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వ్యక్తికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో యూపీహెచ్‌సీ వైద్యులు అప్రమత్తమయ్యారు. జీవీఎంసీ శానిటేషన్, మలేరియా విభాగం అధికారులతో స్ప్రేయింగ్ చేయించారు.

అంపల్లరీ, పాంక్రియాటిక్ క్యాన్సర్లను సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమే..

» నారాయణ మెడిసిటీ ఎం.డి. డాక్టర్ టి.నారాయణరావు

» విజయవంతంగా విపుల్స్ పాంక్రియాటికోడ్ ఓడెనెక్టమి, పాంక్రియాటిక్ నెక్రోసెక్టమీ శస్త్రచికిత్స



చికిత్స చేయించుకున్న రోగి సోమనాథ్

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంపల్లరీ, పాంక్రి యాటిక్ క్యాన్సర్లను ముందుగా గుర్తించడం అత్యంత కీలకమని, సకాలంలో గుర్తించినట్టయితే వీటి నివారణ సాధ్యమేనని నారాయణ మెడిసిటీ ఎం.డి. డాక్టర్ టి.నారాయణరావు అన్నారు. ఈ వ్యాధులకు సమయానికి చికిత్స చేస్తే రోగుల దీర్ఘకాలిక జీవనావకాశాలు గణనీయంగా మెరుగవుతాయని పేర్కొన్నారు. అరుదైన అత్యంత క్లిష్టమైన విపుల్స్ పాంక్రియాటికోడ్ ఓడెనెక్టమితో పాటు పాంక్రియాటిక్‌నెక్రోసెక్టమీ శస్త్రచికిత్సను ఆస్పత్రిలో విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ సోమనాథ్ (59) అనే రోగికి ఈ క్లిష్టమైన చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. రోగి ప్రస్తుతం కోలుకుంటున్నాడని తెలిపారు. ఈ చికిత్సను ప్రముఖగ్యాస్ట్రోఇంటెస్టినల్, హెపాటో - పాంక్రియాటో-బలియరీ శస్త్రచికిత్స నిపుణుడు నారాయణరావు, సహాయక శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ టి.ఆదిత్య, సీనియర్ అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ డి.విజయ్‌కుమార్ రావు నిర్వహించారు.

అప్పన్నకు రూ.1.66 కోట్ల ఆదాయం

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామికి గత 21 రోజుల్లో ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కట్నకానుకల ద్వారా సుమారు రూ.1.66 కోట్ల ఆదాయం లభించింది. ఈవో ఎన్.సుజాత పర్యవేక్షణలో బుధవారం పరకామణి కేంద్రంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. ఇందులో నగదు రూపంలో రూ.1,66,01,951, బంగారం 61.15 గ్రాములు, వెండి 6.72 గ్రాములు, 397 యూఎస్ డాలర్లు, ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, సింగపూర్, ఖతార్, మలేషియా, భూటాన్, తదితర దేశాల కరెన్సీ ఖజానాకు చేరింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓలు వీటీ రమణమూర్తి, కె.తిరుమలేశ్వరరావు, ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘంకు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణభారతినగర్‌లో వైద్యశిబిరం

సాగర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరంతో పాటు గ్రామదత్తత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎండాడ మాజీ సర్పంచ్ చెన్నాదాసు ఒక ప్రకటనలో తెలిపారు. గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు వివిధ రోగాలకు స్పెషలిస్టు వైద్యులతో వైద్య సదుపాయం అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గీతం ఆస్పత్రి స్వర్ణభారతి నగర్‌ను దత్తత స్వీకారం స్వీకరిస్తుందని తెలిపారు.

ఆకట్టుకున్న గీతం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన

» టెక్నో సృజనాత్మకతను చాటిన ఇంజనీరింగ్ విద్యార్థులు » అధునాతన ఉపకరణాల ఆవిష్కరణ



ప్రదర్శనలో ఉంచిన పరికరాలతో ఇంజనీరింగ్ విద్యార్థులు

సాగర్‌నగర్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఇంజనీరింగ్ విద్యార్థులకు నూతనంగా ప్రారంభించిన టెక్నాలజీ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్ (టెప్) కోర్సులో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులు తమలోని వినూత్న ఆలోచనలను ఆకర్షణీయమైన ఇంజనీరింగ్ నమూనాల రూపంలో బుధవారం ప్రదర్శించారు. అధునాతన ఉపకరణాలతో పాటు 3డీ ప్రింటింగ్, డ్రిల్లింగ్, కటింగ్, గ్రైండింగ్, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు ఉపయోగించి రైతులకు ఉపయోగపడే పరికరాలు, ఇనుము, ప్లాస్టిక్‌లు , చెక్కతో సాంకేతిక ఉత్పత్తులను రూపొందించి వినూత్న ఆలోచనలను ఆవిష్కరించారు. గీతం ఇంజనీరింగ్ విద్యార్థులు దాదాపు 150 మంది బృందాలుగా ఏర్పడి దాదాపు 32కి పైగా సాంకేతిక ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

అగ్నిప్రమాదాల్లో రక్షించే రోబోట్, వర్షం నీటిని నిల్వ చేసే పరిజ్ఞానం, స్మార్ట్‌క్రీడా పరికరాలు, అంధులకు మార్గం చూపించే పరికరాలు, సౌరశక్తితో నడిచే పరికరాలు, ఎలక్ట్రికల్‌తో నడిచే గోకార్ట్ వాహనం, టెస్ట్ బ్యాబ్‌లను శుభ్రం చేసే వాషింగ్‌మిషన్లు, ఆకర్షణీయమైన వ్యవసాయ ఉపకరణాలు, పనిముట్లు, తీరప్రాంతాల పరిశుభ్రతకు ఉపయోగించే యంత్రాలు, వరదముప్పును గుర్తించే వంతెనలు-పరికరాలు, స్మార్ట్ పార్కింగ్, సౌర యంత్రాలను శుభ్రపరిచే సామాగ్రి చేతి సంజ్ఞల ఆధారంగా పని చేసే రోబోట్‌లు, వైద్య రంగంలో ఉపయోగపడే రోబో చేతి నమూనాలు యంత్రాలను ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు తమ కోర్సులో అభ్యసించిన అంశాల ఆధారంగా సెన్సార్లు, మోటార్లు, మైక్రోకంట్రోలర్లు తప్పనిసరిగా ఉపయోగిస్తూ అవసరమైన చోట 3డీ ప్రింటింగ్ ద్వారా తమ సాంకేతిక నమూనాలు ప్రదర్శనలో ఉంచారు.

గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరై విద్యార్థులను అభినందించారు. గీతం మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.అత్యుత్తమ ఇంజనీరింగ్ నమూనాలను గుర్తించి నగదు బహుమతులు , సర్టిఫికెట్లు అందజేశారు.



రూపొందించిన పరికరాన్ని ఆపరేట్ చేసి చూపుతున్న విద్యార్థులు



జోన్-4 కార్యాలయంలో ప్రారంభానికి సిద్ధమైన విశాఖ డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం

నేడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం

» ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల ఏర్పాటు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు గురువారం ప్రారంభం కానున్నాయి. విశాఖ డివిజనల్ కార్యాలయాన్ని జగదాంబ జంక్షన్ సమీప జోన్-4 కార్యాలయంలో ఏర్పాటుచేశారు. గతంలో మీ-సేవా కార్యాలయంగా ఉన్న ఫ్లోర్‌నే కేటాయించారు. భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరులో సొంత భవనాలు సిద్ధం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం ఉదయం 11 గంటలకు చిత్తూరు జిల్లా నుంచి డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేస్తారు. డీడీవో కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, మండల పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు హాజరవుతాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు.

15వ వార్డులో రోడ్లు, పార్కు అభివృద్ధికి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవిద్య, పలువురు అధికారులు, కూటమి నేతలు

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.87 లక్షలతో రోడ్లు, ఏపీఎస్‌ఈబీ కాలనీ పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. డాక్టర్స్ కాలనీలోని ఏపీఎస్‌ఈబీ కాలనీలోని పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, టీడీపీ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరుగున పడేసిన పార్కులు, రోడ్ల అభివృద్ధిని ముందుకు తీసుకు వెళుతున్నట్టు చెప్పారు. కార్పొరేటర్ శ్రీవిద్య మాట్లాడుతూ రూ.18 లక్షలతో పార్కు రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాచ్‌మన్ రూమ్ నిర్మాణం చేస్తున్నామని, మిగిలిన వ్యయంతో కాలనీలోని హెచ్‌బీ కాలనీ, జేఆర్‌నగర్ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు సీనియర్ నాయకులు బోర ధనరెడ్డి, ఉపాధ్యక్షుడు బోను సూరిబాబు, ప్రభుత్వ న్యాయవాది బుగత సత్యనారాయణ, జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, టీడీపీ వారు అధ్యక్షుడు బుగత జ్ఞాన సాయి, ఉపాధ్యక్షులు ఆర్.నారాయణ, ఇతర నాయకులు, జీవీఎంసీ అధికారులు డీఈ భాగ్యశ్రీ, ఏఈ చందు, ఏపీఎస్‌ఈబీ కాలనీ ఛైర్మన్ కె.రామారావు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' యాజమాన్యం కార్మిక సంఘాల మధ్య చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉక్కు యాజమాన్యం అధికారులు, కార్మిక నాయకుల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ గణేషన్ సమక్షంలో బుధవారం నగరంలోని ఆర్‌ఎల్సీ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఇందుకు సంబంధించి కార్మిక నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉత్పత్తి ఆధారంగా వేతనాలు ఇచ్చారని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను రద్దు చేశారని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు కార్మిక నాయకులు తెలిపారు. అయితే ప్లాంట్ క్లిష్టమైన దశలో ఉందని, సమస్యల పరిష్కారానికి ఇంకో రోజు కేటాయించారని వారు తెలిపారు.

15 నాటికి కొత్త జోనల్ కార్యాలయాలు సిద్ధం చేయండి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



మాధవధార జోనల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో కొత్తగా ఏర్పాటుచేస్తున్న ఉత్తర నియోజకవర్గం, అగనంపూడి జోనల్ కార్యాలయ భవనాలను ఈనెల 15 నాటికి సిద్ధం చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుత ఎనిమిది జోన్‌లను పది జోన్లకు పెంచుతూ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న జోనల్ కార్యాలయ భవనాలు ఎనిమిది జోన్లకు సరిపోతుండడంతో కొత్తగా ఏర్పాటయ్యే ఉత్తర నియోజకవర్గం జోన్‌కు మాధవ ధార వుడాలేఅవుట్‌లో భవనం నిర్మిస్తున్నారు. అలాగే అగనంపూడి జోన్‌కు తాత్కాలికంగా 85వ వార్డు పరిధిలోని రాజీవ్‌గాంధీ కల్యాణమండపంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటయ్యే జోనల్‌కార్యాలయాలకు ఇప్పటికే అధికారులు, సిబ్బందిని కేటాయించడంతో వీలైనంత వేగంగా జోన్‌లను అందుబాటులోకి తేవాలని కమిషనర్ భావిస్తున్నారు. ఇందులోభాగంగా మాధవధార వుడాలేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఉత్తర నియోజకవర్గం జోన్ కార్యాలయం భవనాన్ని బుధవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలో భవన నిర్మాణపనులు పూరవుతాయని, విభాగాల వారీగా బోర్డులు, అధికారుల నేమ్‌ప్లేట్‌లు, జోనల్‌కార్యాలయాన్ని ప్రజలు గుర్తుపట్టేందుకు వీలుగా గ్లోసైన్‌బోర్డులు, ఏసీలు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని జోనల్‌కమిషనర్ రామును ఆదేశించారు. అనగంపూడి జోన్ కార్యాలయం ఏర్పాటుచేసే 85వ వార్డులోని కల్యాణ మండపాన్ని కూడా పరిశీలించారు. కొత్తభవనం అందుబాటులోకి వచ్చేవరకు తాత్కాలిక ఏర్పాట్లను ఈనెల 15నాటికి పూర్తిచేయాలని చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజుని ఆదేశించారు. లాండ్‌స్కేప్‌తోపాటు సమావేశాల నిర్వహణకు గది, కంప్యూటర్లు, పార్కింగ్ కోసం షెడ్ నిర్మించాలన్నారు. జ్ఞానాపురంలో ఉన్న పశ్చిమ నియోజకవర్గం జోనల్‌కార్యాలయాన్ని ఎన్ఏడీ కొత్తరోడ్డు సమీపంలో నిర్మించేందుకు అనువైన స్థలం గుర్తించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

రైల్వేలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న 72వ అఖిల భారత పురుషుల, మహిళల రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ టోర్నీలో పాల్గొంటున్న 15 జోన్‌లు, ప్రొడక్షన్ యూనిట్లకు చెందిన సుమారు 160 మంది లిఫ్టర్లు కవాతు నిర్వహించి క్రీడా వందనం సమర్పించారు. అనంతరం డీఆర్ఎం లలిత్ బొహ్రా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని అభినందించారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ వంటి టోర్నీలో దేశానికి పతకాలు అందించి భారతీయ రైల్వేల ఖ్యాతిని పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు ఈ.శాంతారామ్, కె.రామారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, ద్రోణాచార్య అవార్డీ సునీల్‌కుమార్, వాల్తేరు రైల్వే వెయిట్ లిఫ్టింగ్ ప్రతినిధులు సురేష్, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

అండర్-16 ఆంధ్ర క్రికెట్ జట్టు కోచ్‌గా త్రినాథ్ యాదవ్



విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆలిండియా అండర్-16 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టు కోచ్‌గా నగరానికి చెందిన పల్లా త్రినాథ్ యాదవ్‌ను నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ సంఘం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 6 నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న ఈ టోర్నీలో ఆంధ్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తాడు. త్రినాథ్ యాదవ్‌ను సీనియర్ క్రికెటర్లు, కోచ్‌లు అభినందించారు.

27 నుంచి ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు



విద్యార్థులతో అతిథులు

సీతమ్మధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల మైదాన ప్రాంగణంలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.మనోజ్ తెలిపారు. క్రీడా పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీనటుడు ఐనవోలు ప్రసన్నకుమార్ లోగోను ఆవిష్కరించారు. విద్యార్థులు జానపద, శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు ఆర్‌వీవీ సత్యనారాయణ, జానపద కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సీతంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి రామాటాకీస్ డౌన్ రోడ్డులో సుంకర రాజా అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి మరో వాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆయన రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుంకర రాజా కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు.

ప్రణాళికాబద్ధంగా పరిశ్రమిస్తేనే ఉన్నత లక్ష్యం సాధ్యం

▸ పోటీ పరీక్షల అభ్యర్థులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉద్బోధ



పౌరగ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థులతో సంభాషిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సీతంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ వంటి ఉన్నత లక్ష్యం సాధించాలనుకున్నప్పుడు ఓ ఆరు నెలలో, ఏడాదో పరీక్షల కోసం చదివితే ఫలితం ఉండదని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పష్టంచేశారు. విద్యార్థి దశ ప్రారంభం నుంచే నిరంతరం శ్రమించాలని సూచించారు. ఆత్మ విశ్వాసం తప్ప అతి విశ్వాసం కూడదని, పరీక్షల్లో ఒక మార్కు కూడా భవిష్యత్తును నిర్ణయించగలదని పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల విశాఖ పౌరగ్రంథాలయాన్ని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం సందర్శించి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. గ్రంథాలయం కార్యదర్శి డీఎస్ వర్మ, లైబ్రేరియన్ దుర్గారాణి గ్రంథాలయంలోని వివిధ విభాగాలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అధ్యయనం చేస్తున్న అభ్యర్థులు, విద్యార్థులతో కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం అక్కడి హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఐఏఎస్ సాధించే వరకు తన ప్రస్థానంలోని పలు అంశాలను ఆసక్తి కరంగా వివరించారు. సాధారణ విద్యార్థి అయిన తాను ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తన తల్లిదండ్రుల మార్గదర్శనం, ప్రోత్సాహంతో కఠినంగా పరిశ్రమించి ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. వివిధ అంశాలపై మౌలిక పరిజ్ఞానం తొలుత పొందాలని, ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ దశల్లో సన్నద్ధత ఎలా ఉండాలో విశ్లేషించారు. గ్రంథాలయంలో చదువుకోవడానికి ఉత్తమ వాతావరణం ఉందని, ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని హితవు పలికారు. ఉన్నత ప్రమాణాలతో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న పాలక వర్గాన్ని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ, సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు శాలువా కప్పి సన్మానించారు.

డిప్యూటీ స్పీకర్‌ను పదవి నుంచి తొలగించాలని విదసం డిమాండ్



సమావేశంలో పాల్గొన్న విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు, ఇతర ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు ఎగవేసి ఆర్థిక నేరస్థుడిగా సీబీఐ కేసులో నిందితుడైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును తక్షణమే అరెస్టు చేసి, పదవి నుంచి తొలగించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవన్ ఆవరణలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని డీఓపీటీకి ఫిర్యాదు చేయడం గురివింద గింజ వైఖరి అని విమర్శించారు. రాష్ట్రపతి స్పందించి డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి తొలగించాలని బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై వ్యక్తిగత కక్షతో ఆయన మాటలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. దళితులు, కాపులు ఏకం కావలసి ఉందన్నారు. జాజి ఓంకార్, సోదదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, శేఖర్, అల్మండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వరకు స్వాములకు భిక్ష

అక్కయ్యపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలో గల షిర్డీ సాయిబాబా ధాన్యమందిరంలో సంక్రాంతి వరకు మాల ధరించినవారికి భిక్ష ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. గురువారం నాటికి 41 రోజుల మండల కాలంలో 15 వేల మంది స్వాములకు భిక్ష ఏర్పాటు చేశామన్నారు. దాతలు కార్యాలంలో సంప్రదించాలని సూచించారు.

కళాశాలకు ఫ్యాన్ల వితరణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వాసవీ క్లబ్ స్మార్ట్ విశాఖ డైమండ్స్ స్వచ్ఛంద సంస్థ ఐదు ఫ్యాన్లు, విద్యార్థినులకు నోట్ పుస్తకాలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్.మంజుల తెలిపారు. వారి సేవా నిరతి అభినందనీయమన్నారు. క్లబ్ గవర్నర్ అమర్‌నాథ్, ప్రెసిడెంట్ మానస, సభ్యులు పాల్గొన్నారు.

జూ అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ప్రణాళికలు బాగుంటాయో గుర్తించి, వారిని కన్సల్టెంట్‌గా నియమిస్తారు. ఆ తరువాత ప్రణాళికాబద్ధంగా వాటిని అభివృద్ధి చేస్తారు. వీటికి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కవిత్వం సమాజ దిక్సూచి కావాలి



ప్రసంగిస్తున్న రచయిత్రి రాధారాణి

సీతంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో కవుల స్వీయ కవితా పఠనం, సమ్మేళన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు రచయితలు మాట్లాడుతూ కవిత్వం సమాజ దిక్సూచి కావాలన్నారు. ప్రతి కవిత భావావిష్కరణతో ఆలోచింపజేసేదిగా ఉండాలన్నారు. కవి చప్పట్లు తప్ప ఇంకేమీ కోరుకోడంటూ, అతని మనస్సును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కె.జి.వేణు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ దేవులపల్లి పద్మజ, బి.రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

జీవో 129తో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం



జీవో 129 ప్రతిని చూపుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, అసోసియేషన్ ప్రతినిధులు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ)కు శాశ్వత సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యత్వం కల్పిస్తూ ప్రభుత్వం జీవో 129 జారీ చేయడం వల్ల ఆర్టీసీ కార్మికులకు మేలు జరుగుతుందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, ఆర్టీసీ ఎన్ఎంయూఏ రీజనల్ గౌరవాధ్యక్షుడు పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. ప్రభుత్వం ఈ జీవో జారీచేయడం పట్ల ఎన్ఎంయూఏ నాయకులు ఆనందం వ్యక్తంచేస్తూ బుధవారం విష్ణుకుమార్‌రాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలా కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. 129జీవో జారీకి కృషిచేసిన అసోసియేషన్ నాయకులను అభినందించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు, కోశాధికారి పీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి కొత్తజోనల్ కార్యాలయాలు సిద్ధం చేయండి: కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో కొత్తగా ఏర్పాటుచేస్తున్న ఉత్తర నియోజకవర్గం, అగనంపూడి జోనల్ కార్యాలయ భవనాలను ఈనెల 15 నాటికి సిద్ధం చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుత ఎనిమిది జోన్‌లను పది జోన్లకు పెంచుతూ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న జోనల్ కార్యాలయ భవనాలు ఎనిమిది జోన్లకు సరిపోతుండడంతో కొత్తగా ఏర్పాటయ్యే ఉత్తర నియోజకవర్గం జోన్‌కు మాధవధార వుడా లేఅవుట్‌లో భవనం నిర్మిస్తున్నారు. అలాగే అగనంపూడి జోన్‌కు తాత్కాలికంగా 85వ వార్డు పరిధిలోని రాజీవ్‌గాంధీ కల్యాణమండపంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటయ్యే జోనల్‌కార్యాలయాలకు ఇప్పటికే అధికారులు, సిబ్బందిని కేటాయించడంతో వీలైనంత వేగంగా జోన్‌లను అందుబాటులోకి తేవాలని కమిషనర్ భావిస్తున్నారు. ఇందులో భాగంగా అగనంపూడి జోన్ కార్యాలయం ఏర్పాటుచేసే 85వ వార్డులోని కల్యాణ మండపాన్ని బుధవారం పరిశీలించారు. కొత్తభవనం అందుబాటులోకి వచ్చేవరకు తాత్కాలిక ఏర్పాట్లను 15నాటికి పూర్తిచేయాలని చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజుని ఆదేశించారు. లాండ్ స్కేప్‌తోపాటు సమావేశాల నిర్వహణకు గది, కంప్యూటర్లు, పార్కింగ్ కోసం షెడ్ నిర్మించాలన్నారు. పశ్చిమ నియోజకవర్గం జోనల్ కార్యాలయాన్ని ఎన్ఏడీ కొత్తరోడ్డు సమీపంలో నిర్మించేందుకు స్థలం గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

కార్యకర్తల అభీష్టం మేరకే కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక: సునీల్ అహీరా



వేదికపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సునీల్ అహీరా తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల అభీష్టం మేరకు, మెజారిటీ నిర్ణయంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపిక చేయనున్నట్లు ఏఐసీసీ అధికార ప్రతినిధి, విశాఖ జిల్లా పరిశీలకుడు సునీల్ అహీరా అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు విశాఖ వచ్చానని తెలిపారు. జిల్లాలో నాయకులు పార్టీని వీడినా క్యాడర్ చెక్కుచెదరలేదని అహీరా అన్నారు. కొత్త అధ్యక్షుడి ఎంపిక తరువాత పార్టీ బలోపేతంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు అమర్‌జా బేగం, మార్టిన్ లూథర్, వేగి వెంకటేశ్, కమలాకర్, హాసినీ వర్మ, ప్రియాంకా దండి, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ఏఎంసీ

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 26వ అంతర్ వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాజమండ్రి జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన వాలీబాల్ టోర్నీలో అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం, చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. టెన్నిస్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పతక సాధకులను బుధవారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం.సంధ్యాదేవి తన కార్యాలయం వద్ద అభినందించారు. ఏఎంసీ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు, కార్యదర్శి ఎన్.భానుసతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విశాఖ, బ్రహ్మపూర్, పలాస రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని గరివిడి, జి.సిగడాం, చీపురుపల్లి సెక్షన్‌లలో ఆధునికీకరణ పనులు చేపడుతున్నందున పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. వీటిలో ఈ నెల 5, 7 తేదీల్లో విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), ఈ నెల 6, 8 తేదీల్లో బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531)లు రద్దు చేశామన్నారు. అలాగే ఈ నెల 6, 7 తేదీల్లో విశాఖ-పలాస మధ్య నడిచే 67289, 67290 నంబర్లు గల మెము పాసింజర్ రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు.

బెనారస్ స్టేషన్ కోడ్ మార్పు

నార్త్ ఈస్టర్న్ రైల్వే జోన్, వారణాసి డివిజన్‌లోని బెనారస్ స్టేషన్ కోడ్‌ను బీఎస్‌బీఎస్ నుంచి బీఎన్ఆర్ఎస్‌గా మార్పు చేశామని, కొత్త కోడ్ ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చిందని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ పేర్కొన్నారు.

'స్నేహ' మ్యాక్స్ వ్యవస్థాపకుడు శివభాగ్యారావు అరెస్టు

▸ నిందితుడు రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి

గోపాలపట్నం (విశాఖపట్నం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'స్నేహ' మ్యాక్స్ సొసైటీ పేరుతో పలువురి నుంచి డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించకుండా పరారైన సంస్థ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి శివభాగ్యారావును ఎట్టకేలకు గోపాలపట్నం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..స్నేహ మ్యాక్స్ సొసైటీ పేరుతో సంస్థను స్థాపించిన శివభాగ్యారావు పలువురి నుంచి రూ.3.13 కోట్లు డిపాజిట్లు సేకరించారు. అయితే గడువు ముగిసినప్పటికీ సొమ్మును తిరిగి చెల్లించడం లేదంటూ 15 మంది ఖాతాదారులు ఈ ఏడాది ఆగస్టులో గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు అప్పటికే పరారీలో ఉన్న శివభాగ్యారావు కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హైదరాబాద్‌లో శివ భాగ్యారావుతో పాటు సంస్థలో భాగస్వామి అయిన అతడి కుమారుడు క్రాంతిని అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరినీ నగరానికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపారు.

ఉక్కు మంత్రి కుమారస్వామితో ఎంపీ శ్రీభరత్ భేటీ

పెదవాల్తేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం పరిరక్షణకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డి కుమారస్వామికి ఎంపీ ఎం.శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్‌లతో కలిసి కేంద్ర మంత్రిని కలిశారు. ఉక్కు కర్మాగార భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. నిర్ణయాలు ఆలస్యం కాకుండా ఉండేందుకు పూర్తిస్థాయి చైర్మన్‌ను, డైరెక్టర్లను తక్షణం నియమించాల్సిన అవసరం ఉన్నదని మంత్రికి ఎంపీ వివరించారు. అలాగే దీర్ఘకాలిక స్థిరత్వం కోసం సెయిల్ ఆధ్వర్యంలోకి విశాఖ ఉక్కును తీసుకువెళ్లేందుకు గల అవకాశాలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ అంశాలన్నింటిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. విశాఖ ఉక్కు కర్మాగారంతోపాటు ఉద్యోగుల ప్రయోజనాల కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ శ్రీభరత్ అన్నారు.

అవినీతిలో ఘనుడు

... 5వ పేజీ తరువాయి

పంపిణీలో అక్రమాలకు పాల్పడుతుంటారనే ఫిర్యాదులు ఉన్నాయి.

సర్కిల్-3 పరిధిలో 130 రేషన్ డిపోలు ఉన్నాయి. ప్రతి డిపో నుంచి నెలకు రెండు వేల వంతున మామూళ్లు వసూలు చేస్తున్నట్టు డీలర్లే చెబుతున్నారు. ప్రధానంగా బినామీ డిపోలకు సంబంధించి అక్రమాలకు ప్రోత్సహించారనే వాదన ఉంది. దీనికి అదనంగా నెలకు ఐదు వేల రూపాయల వరకూ తీసుకుంటున్నారు. అదేవిధంగా సర్కిల్-3లో కొన్ని షాపులను రేషన్ డీలర్ల సంఘం నేత ఒకరితో కలిసి ఏఎస్‌వోనే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఈ వ్యవహారం నడుపుతున్నారంటున్నారు. ఇంకా డిపోల ద్వారా పంపిణీ చేసే బియ్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే మాఫియాతో ఏఎస్‌వోకు సన్నిహిత సంబంధాలున్నాయి. రైస్ మిల్లర్ల నుంచి భారీగా మామూళ్లు తీసుకుంటున్నారని, అందుకే వారి అక్రమాలను చూసీచూడనట్టు వదిలేస్తున్నారని గాజువాక ప్రాంతానికి చెందిన డీలర్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందితే గత్యంతరం లేక డిపో లేదా అక్రమ బియ్యం తరలిస్తున్న వాహనాలపై కేసులు పెడుతుంటారు తప్ప అధికారిగా తన విధులు నిర్వహించడంలో విఫలమయ్యారని డీలర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

మిక్స్‌డ్ సాల్వెంట్ పక్కదారి!

... 5వ పేజీ తరువాయి

శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో పరీక్షించి అన్ని ప్రమాణాలు సరిపోయిన తరువాతే అన్‌లోడింగ్‌కు అనుమతిస్తారు. ప్రతి ట్యాంకు పరిశ్రమకు వచ్చేటప్పుడు 18 శాతం వ్యాట్ చెల్లించినట్టు ఇన్‌వాయిస్, ఇతర బిల్లులు ఉండాలి. ఇంత సుదీర్ఘమైన ప్రొసీజర్ పాటించాల్సి ఉన్నప్పటికీ హైదరాబాద్, చెన్నైకు చెందిన ముఠాలు అడ్డగోలుగా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి దాంట్లో మరికొన్ని రసాయనాలు కలిపి ఇండస్ట్రియల్ డీజిల్ అని చెప్పి వాహనదారులకు అమ్ముతున్నాయి. ప్రతిరోజు వందల లీటర్లు వినియోగించే కాంట్రాక్టర్లు, సెల్ టవర్లు, ఇతర ట్రాన్స్‌పోర్టు కంపెనీలతో ముందుగా మాట్లాడుకుని తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇలా సరఫరా చేసే ముఠా ట్యాంకర్లను మొబైల్ పెట్రోల్ బంకులుగా పిలుస్తుంటారు. మిక్స్‌డ్ సాల్వెంట్‌లో మరికొన్ని రసాయనాలు కలిపిన ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగించే వాహనాల జీవితకాలం పడిపోతుంది. వాటి నుంచి వచ్చే పొగ పర్యావరణానికి తీవ్ర ముప్పుగా ఉంటుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఈ ముఠాలు చేసే అడ్డగోలు వ్యాపారంతో ప్రభుత్వానికి ఏటా రూ.1,000 కోట్ల నుంచి రూ.1200 కోట్ల మేర ఆదాయానికి గండి పడుతుంది. కాగా పెందుర్తిలో పట్టుకున్న ఇండస్ట్రియల్ డీజిల్‌ను విజయవాడలో ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశాలలో పౌరసరఫరాల శాఖ అధికారులు 'సవీరా' కంపెనీపై 6-ఎ కేసు నమోదు చేశారు.

జంబో అజెండా!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చేశారు. తాజాగా ర్యాటిఫికేషన్ కోసం అజెండాలో ప్రతిపాదించడం విశేషం. ఏదైనా పనికి ముందుగా స్టాండింగ్‌కమిటీ ఆమోదం తీసుకుని టెండర్లు పిలవాలి. కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించాలి. కానీ పనులు అప్పగించేసిన ఎనిమిది నెలల తర్వాత స్టాండింగ్‌కమిటీ ఆమోదం కోరడం విడ్డూరంగా ఉందని అధికారులే అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి అంశాలను అజెండాలో అధికారులు ప్రతిపాదిస్తే కమిషనర్, మేయర్ అభ్యంతరం తెలపకుండా ఎలా సమ్మతిస్తున్నారో అర్థం కావడం లేదంటున్నారు.

మరిన్ని అంశాలివీ...

అనకాపల్లి జోన్‌లో ఫ్లెక్సీలను తొలగించేందుకు వీలుగా రోజువారి వేతనంపై ఐదుగురు కార్మికులను నియమించే అంశాన్ని అజెండాలో చేర్చారు. 71వ వార్డులో జీవీఎంసీ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి ఉత్సవం నిర్వహించేదుకు అనుమతి కోరుతూ అజెండాలో చేర్చారు. జోన్-6 పరిధిలోని 11 సులభ్ కాంప్లెక్స్‌లలో కేర్‌టేకర్లుగా పనిచేస్తున్న 22 మందికి వేతనాలు చెల్లించే అంశాన్నీ అజెండాలో చేర్చారు. బీచ్‌రోడ్డులో సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌కు ఇప్పుడున్న స్థలానికి ఆనుకుని 367 చదరపు గజాలను అదనంగా రూ.2.29 లక్షల నెలసరి అద్దెకు కేటాయించే అంశాన్ని ప్రతిపాదించారు. సాగర్‌నగర్‌లో మురుగునీరు సముద్రంలో చేరకుండా ఎస్టీపీలోకి తరలించేందుకు, మురుగునీటిలో వ్యర్థాలను వేరుచేసేందుకు స్టెయిన్‌లెస్‌స్టీల్ పాలీమెకనెట్ ఏర్పాటు అంశాన్ని అజెండాలో ఉంచారు. జీవీఎంసీ కార్యక్రమాలను డ్రోన్‌ద్వారా చిత్రీకరించేందుకు నెలకు రూ.25వేల వేతనానికి ఆపరేటర్‌ను ఎస్ఎల్ఎఫ్ ద్వారా నియమించుకునే అంశాన్ని చేర్చారు. ఈఏడాది జూన్21న నగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఏర్పాట్లు, సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన, పార్కింగ్ స్థలాలను చదనుచేయడం వంటి పనులకు చేసిన ఖర్చులను కాంట్రాక్టర్లకు చెల్లించే అంశాలను భారీగానే అజెండాలో చేర్చారు. ఇవికాకుండా వార్డుల్లో అభివృద్ధి పనులు, వివిధ జోన్‌ల పరిధిలో దుకాణాల వేలం, రోడ్డుమార్జిన్ల ఆశీలు వసూలు వేలం వంటి అంశాలను పొందుపరిచారు.

'విభిన్న ప్రతిభావంతులకు ఆత్మవిశ్వాసమే ఆయుధం'



అక్కయ్యపాలెం భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు



డాబాగార్డెన్స్‌లో 'ది ఎబిలిటీ పీపుల్ ఫౌండర్' ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం

అక్కయ్యపాలెం/మహారాణిపేట/డాబాగార్డెన్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆత్మస్థైర్యంతో అడుగేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పలువురు ఉద్ఘాటించారు. అక్కయ్యపాలెంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు డి.రామారావు, బాలామణి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు జయంతి రాధాకుమారి, కనకమహాలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఈవో బాలామణి మాట్లాడుతూ దివ్యాంగులుగా జన్మించడం శాపంగా భావించొద్దని, వారిని భవిత కేంద్రానికి పంపాలన్నారు. భవిత కేంద్రం టీచర్లు శారద, జగదాంబ తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్‌లోని మహారాణిపేట భవిత కేంద్రం, కలెక్టరేట్ జంక్షన్ సమీపంలోని జీవీఎంసీ అచ్యుతరామ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. తొలుత దివ్యాంగులు, సాధారణ పిల్లలతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ పోటీలు జరిగాయి. భవిత కేంద్రం అందజేస్తున్న వివిధ రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైకల్యం గల పిల్లల్లో సామర్థ్యం అంతర్లీనంగా ఉంటుందని, ప్రత్యేక బోధన పద్ధతులతో బయటకు తీయాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు పి.పైడపు నాయుడు, పుష్పరాగం, పి.శ్వేతలత, డి.ప్రతిమా, ప్రియా, జ్యోతి, దివ్యాంగ విదార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలు ఉంటాయని, ఇందుకు తననే ఉదాహరణగా తీసుకోవాలని 'ది ఎబిలిటీ పీపుల్ ఫౌండర్ డైరెక్టర్ దిలీప్ పాత్రో అన్నారు. డాబాగార్డెన్స్ డ్వాక్రాబజార్‌లో విభిన్న ప్రతిభావంతులతో కలివిడిగా మాట్లాడారు. కృత్రిమ అవయవాలు వినియోగించే విధానం తెలియజేశారు. దృఢసంకల్పంతో ముందుకు వెళ్తే జీవితంలో గొప్పస్థాయిలో కూర్చొనే అవకాశం కలుగుతుందన్నారు. 'ది ఎబిలిటీ పీపుల్' అధ్యక్షుడు పడాల విజయశంకర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. అనంతరం పలువురికి ఉచితంగా చక్రాల కుర్చీలు, కృత్రిమ పరికరాలను పంపిణీ చేశారు.



కలెక్టరేట్ వద్ద దివ్యాంగ విద్యార్థులతో అతిథులు

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా దంపతులు



కప్పస్తంభం వద్ద పల్లా దంపతులు

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న పల్లా దంపతుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

'లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి'

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెన్షన్లు పొందుతున్న వారంతా వచ్చేఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా వార్షిక ధ్రువీకరణ (లైఫ్) సర్టిఫికెట్లు జిల్లా, డివిజనల్, సబ్‌ట్రెజరీల్లో అందజేయాలని జిల్లా ఖజానా అధికారి కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోగా అందజేసి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు పొందాలన్నారు. ఈ మేరకు పెన్షనర్ల అసోసియేషన్లు అవగాహన కల్పించాలని కోరారు.

ఎండాడలో డెంగ్యూ కేసు నమోదు

ఎండాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో డెంగ్యూకేసు నమోదయింది. పలు ప్రాంతాల్లో వైరల్ ఫీవర్, ఒళ్లు నొప్పులతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వ్యక్తికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో యూపీహెచ్‌సీ వైద్యులు అప్రమత్తమయ్యారు. జీవీఎంసీ శానిటేషన్, మలేరియా విభాగం అధికారులతో స్ప్రేయింగ్ చేయించారు.

నేడు గిరి ప్రదక్షిణ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమి సందర్భంగా గురువారం స్టీల్‌ప్లాంట్ వెంకటేశ్వరుడి ఆలయంలో గిరిప్రదక్షిణ నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం ఆరు గంటల నుంచి గిరి ప్రదక్షణ ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈ ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు టార్చ్‌లైట్లు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

'క్రీడల్లోనూ రాణించాలి'

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచిన అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులను బుధవారం ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.కుమారస్వామి, పాఠశాల అధ్యాపకులు, గుడివాడ లతీశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడీ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు(నలుపు) 48, గుత్తి/రవి వంకాయలు 48, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, బజ్జి పకోడి మిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళదుంపలు 18, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబాటి 42, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్ద చిక్కుడు 40, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 58, గ్రీన్‌పీస్ బటాని 90, గోరు చిక్కుడు 50, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, పాల కూర (కట్ట) 3, తోటకూర (క ట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక జాబ్‌మేళా

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సిరిపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభా వంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మూడు నెలలకోసారి ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, ఆర్థిక ప్రయోజనాల అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల అంతర్జాతీయ అంధుల క్రికెట్ మ్యాచ్‌లో కీలకంగా వ్యవహరించిన ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థిని కరుణ కుమారి ఆట తీరు ఆదర్శమన్నారు. అంగవైకల్యం ఉదని కుంగిపోకూడదని, నచ్చిన రంగంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం రూ. 5వేలు పింఛను అందిస్తోందని, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలకు పెంచిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, ఏడాదికి అదనంగా ఏడు రోజుల సెలవు, ముఖ ఆధారిత హాజరు మినహాయింపు తదితర వెసులుబాట్లు కల్పించదన్నారు. వైకల్యం ఉందని కుంగిపోవద్దని, మీ శక్తి సామర్థ్యాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. జిల్లాలో వికలాంగుల సంఘాలు ఐక్యంగా పని చేస్తున్నాయన్నారు.సైన్ లాంగ్వేజిపై సాధారణ పౌరులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి ఎలాంటి సహాయమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందరగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్, యూసీడీ పీడీ సత్యవతి, సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థినులతో కలెక్టర్, తదితరులు



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ అండ

మల్కాపురం: విభిన్న ప్రతిభావంతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ప్రకాశ్‌నగర్ ఏడుగుళ్ల జంక్షన్‌లో ఉన్న విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతు దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన వారు ఉన్నారని వారి విజయాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. అన్ని రంగాల్లో వారి ప్రతిభను కనబరుస్తూ ఆత్మస్థైర్యాన్ని చాటుకుంటు ముందుకు వెళ తున్నారని తెలిపారు. అనంతరం పలువురికి వీల్‌ఛైర్లు, బ్లైండ్ స్టిక్స్ ఇతర పరికరాలను అందజేశారు. అలాగే మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ములగాడ ఎంఈవో వెంకటరావు పాల్గొని మాట్లాడారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

పెదగంట్యాడ: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి కె.రమణాజీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను అందరితోపాటు సమానంగా చూసేందుకు విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, న్యూపోర్టు ఏఎస్‌ఐ ఎన్‌వీ రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

గోపాలపట్నం: విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఎంఈవో దివాకర్ అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ పాఠశాలలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులకు ప్రభుత్వ కల్పిస్తున్న పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకో వాలన్నారు.



పులి భూలోకరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

నిర్వాసితుల కోసం భూలోకరెడ్డి కృషి ఆదర్శం

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ఉపాధి కోసం కృషి చేసిన ఉన్నత వ్యక్తి పులి భూలోకరెడ్డి అని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పెందగంట్యాడ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన భూలోకరెడ్డి 18వ వర్ధంతి సభకు పల్లా ముఖ్యఅతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా భూలోక రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నెల్లిముక్కులో నిర్మించిన జీవీఎంసీ కల్యాణమండపానికి భూలోకరెడ్డి పేరుపెట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణ దశలోనే నిర్వాసితులకు ఉపాధి కల్పనకు చేసిన ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారు అని అన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే పల్లా

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని, వారే పార్టీకి వెన్నెముక అని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల మనోభావాలు, స్థితిగతులు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న 'నా కార్యకర్త' కార్యక్రమంలో భాగంగా 72వ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావుతో బుధవారం మాట్లాడారు. ఇప్పటి వరకు సుమారు ఐదు వందల మందితో కార్యకర్తలతో మాట్లాడానని పల్లా పేర్కొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఆయన కార్యాలయంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు రుణాల మంజూరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు రంగుల వేసి ప్రచారం చేసుకోవడంతోనే కాలయాపన చేసిందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి బ్యాంక్ రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు ఇళ్లన అందించే ప్రక్రియ పూర్తి స్థాయిలో చేపడుతున్నామని అన్నారు.

ఉత్పత్తి ఆధారిత వేతనాల విధానం దారుణం

» ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ఆధారిత వేతనాలు ఇవ్వటం సరికాదని, ఇది కార్మిక వర్గంపై యాజమాన్యం చేస్తున్న దాడి అని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ అధ్యక్షుడు వీవీ.రమణమూర్తి ఆధ్వర్యంలో కాగడాలు వెలిగించి ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని అన్నారు. అధిక ఉత్పత్తి సాధించేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉందని, కానీ తగిన వనరులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కార్మికులకు పూర్తి వేతనాలు ఇవ్వాలని, లేని పక్షంలో తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.



కాగడాలు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఇంటక్ నాయకులు

జీతాల్లో కోతలు దుర్మార్గం

దేశంలో ఎక్కడా లేని విధంగ ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం జీతాల్లో కోత విధించడం దుర్మార్గమని స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రామస్వామి, జె .అయోధ్యరాం అన్నారు. జీతాల్లో కోతవిధించడంతో బుధవారం ప్లాంట్ టీటీఐ జంక్షన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి విద్యుత్ బిల్లుల భారం మరింత పెరిగిందన్నారు. ముడి సరకు అందు బాటులో ఉంటే తాము అధిక ఉత్పత్తి సాధిస్తామని అన్నారు.

యాజమాన్యం కార్మిక సంఘాల మధ్య చర్చలు

ఉక్కు యాజమాన్యం అధికారులు, కార్మిక నాయకుల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ గణేషన్ సమక్షంలో బుధవారం నగరంలోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఇందుకు సంబంధించి కార్మిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉత్పత్తి ఆధారంగా వేత నాలు ఇచ్చారని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను రద్దు చేశారని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తాము కోరామని కార్మిక నాయకులు తెలిపారు. అయితే ప్లాంట్ క్లిష్టమైన దశలో ఉందని, సమస్యల పరిష్కారానికి ఇంకో రోజు కేటాయించారని వారు తెలిపారు.

సరికొత్త ప్రేమ కథా చిత్రం మోగ్లీ

» 12న విడుదల » నగరంలో చిత్ర యూనిట్ ప్రమోషన్



చిత్ర ప్రమోషన్‌లో హీరో రోషన్, హీరోయిన్ సాక్షి, నటుడు హర్ష

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సరికొత్త ప్రేమ కథా చిత్రంగా మోగ్లీ సినిమా తెరకెక్కిందని హీరో రోషన్ కనకాల అన్నారు, యాంకర్ సుమ, రాజీవ్ కనకాల తనయుడు రోషన్ హీరోగా, సాక్షి హీరోయిన్‌గా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మోగ్లీ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్‌ను బుధవారం నగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ గ్రీన్ పార్కులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హీరో రోషన్ మాట్లాడుతూ మోగ్లీ కేవలం సినిమా కాదని యువత ఫీల్ అయ్యే కథ అన్నారు. సాధారణ యువకుడిగా తన పాత్ర కోసం చాలా పరిశోధన చేశానని, చిత్రం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. విశాఖపట్నం, పాడేరు తదితర ప్రాంతాల్లోనే ఎక్కువగా షూటింగ్ చేశామన్నారు. సినిమాలో హర్ష కామెడీ, కాలభైరవ సంగీతం హైలెట్‌గా నిలుస్తాయన్నారు. హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ విశాఖ చాలా ఇష్టమని మోగ్లీ చిత్ర ప్రచారం ఇక్కడ నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సినిమాలో తనది ఛాలెంజింగ్ రోల్ అని, ఎమోషన్‌తో కూడిన అందమైన ప్రేమ కథ అన్నారు, సమావేశంలో నటుడు హర్ష పాల్గొన్నారు

నిరుద్యోగులకు జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 5న భారీ జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఏడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా ఉపాధికల్పనాధికారులు సూచించారు.

8న అప్రంటిస్ మేళా

ఈ నెల 8న కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో అప్రంటి స్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.సోలమన్ తెలిపారు. ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన 25 ఏళ్ల లోపు వయసు కలిగిన యువత పాల్గొనవచ్చునన్నారు. స్టీల్‌ప్లాంట్, కోరమాండల్ తదితర కంపెనీలు ఎంపిక చేస్తాయన్నారు. అభ్యర్థులు 8న ఉదయం 9గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. సుమారు 260 మందికి అప్రంటిస్ శిక్షణ అందిస్తామన్నారు.

చోరీల నియంత్రణపై అవగాహన

గోపాలపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే చోరీల నియంత్రణ సాధమని పశ్చిమ క్రైం సీఐ చంద్రమౌళి అన్నారు. పాత గోపాలపట్నంలోని వెంకటాద్రి హిల్స్, శేషాద్రి హిల్స్ అపార్ట్‌మెంట్‌లో నేరాల నియంత్రణపై బుధవారం అవగాహన కల్పించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళంవేసి ఉన్న ఇళ్లలో చోరీలు, ప్రయాణాల్లో చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అపార్ట్‌మెంట్‌ల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుడి మృతి



కె.సూర్యారావు(ఫైల్)

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ఎంజీ ఎం యార్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన కె.సూర్యారావు (56) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఎంజీఎం విభా గం వేబ్రిడ్జి వద్ద నిర్వహణ పనులు చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన రైల్వే వ్యాగన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సూర్యారావు మృతిచెందాడు. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

పాలకులు ప్రజల మన్ననలు పొందాలి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేపట్టి ప్రజాప్రతినిధులు ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. 96వ వార్డు పెందుర్తిలో రూ.3.53 కోట్ల కార్పొరేషన్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. నగర మేయరు, పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు రూ.1.55 కోట్లతో నిర్మాణం కానున్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, రూ.1.98 కోట్లతో నిర్మాణంకానున్న థీమ్ పార్క్ పనులకు సంయుక్తంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ పీలా శ్రీనివాసరావు మేయరు కుర్చీ ఎక్కిన తరువాత నగరం అభివృద్ధి బాట పట్టిందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గం పరిధిలో ఉన్న వార్డుల్లో సుమారు రూ. 175 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజాప్రతినిధులకు ప్రజలు పట్టం కడతారన్నారు. మేయర్ పీలా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, థీమ్ పార్క్‌లకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. తను మేయర్‌గా పదవి చేపట్టినప్పటి నుంచి నగరంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత, పీఏసీఎస్ ఛైర్మన్ అయతి సింహాచలం, తదితర నాయకులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు వక్రీకరించవద్దు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కోనసీమ జిల్లా రాజోలులో పర్యటించిన సందర్భంగా పవన్ రైతులతో మాట్లాడుతూ అన్న మాటలను పలువురు వక్రీకరిస్తున్నారని అన్నారు. పవన్ ఒక ప్రాంతానికి చెందిన నాయకుడు కాదని ఆయన అందరివాడన్నారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు పవన్ మాటలను వక్రీకరిస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

కంటి ఆస్పత్రికి రెటినోపతి పరికరం బహూకరణ

వేపగుంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి హిందూస్థాన్ షిప్‌యార్డు యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా రూ.18.64 లక్షలు విలువచేసే రెటినోపతి ఆఫ్ ప్రిమెట్యూరిటీ స్క్రీనింగ్ పరికరాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ రాకేశ్ మాట్లాడుతూ అంధత్వ నివారణలో భాగంగా సామాన్య ప్రజానీకానికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి చేస్తున్న సేవల్లో తాము కూడా భాగస్వాములు అవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే కార్యక్రమాల్లో కూడా తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని అవయవదాతల లేఖ

గోపాలపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అఖిల భారత అవయవదాతల సంఘ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖకు సంఘ వ్యవస్థాపకరాలు గూడూరు సీతామహాలక్ష్మి లేఖ పంపించారు. అవయవ దాతలు మరణిస్తే వారి శరీరాన్ని వైద్య కళాశాలలు స్వీకరించి భద్రపరిచే విధంగా ఆదేశాలు జారీ చేయాలని లేఖలో పేర్కొన్నారు. పార్థివ దేహాల తరలింపునకు ఉచితంగా వాహనం ఏర్పాటు చేయాలని, శరీరం దానం చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఉచిత ఆన్‌లైన్ సదుపాయం కల్పించాలని కోరారు. అవయవ మార్పిడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరగాలని లేఖలో పేర్కొన్నారు. అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని, అవయవ మార్పిడి జరగకముందే మృతి చెందితే వారి రిజిస్ట్రేషన్ ఫీజు వాపసు ఇవ్వాలని కోరారు. అవయవ దాత కుటుంబీకులకు ప్రోత్సహకాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

గాజువాకలో బైక్ ర్యాలీ

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ వ్రతాలను పురస్కరించుకుని గాజువాకలోని పలు చోట్ల విశ్వహిందూ పరిషత్, గాజువాక ప్రఖండ ఆధ్వర్యంలో బుధవారం ద్విచక్ర వాహనాల ర్యాలీని బీజేపీ ఇన్‌చార్జి కరణం రెడ్డి నరసింగరావు ప్రారంభించారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం హిందూవుల్లో చైతన్యం రావాలని ఆయన అన్నారు. ప్రజల్లో భక్తిభావం పెరిగినప్పుడు సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులు అప్‌డేటెడ్‌గా ఉండాలి'

అగనంపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు తగినట్టు రాణిస్తూ ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా ఉంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లీడ్ ఫిజికల్ డిజైన్ ఇంజనీర్, సెమీ కండక్టర్ డిజైనర్ హరీశ్ పేర్కొన్నారు. విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వీఎల్ఎస్ఐలో గల ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అనుకూలంగా విద్యార్థులను తయారు చేయాలని అన్నారు.